

నేడే అమరావతికి పయనం

- డీఎస్సీలో ఎంపికైన వారికోసం 45 బస్సుల ఏర్పాటు

(వివరాలు 6వ పేజీలో...)



- ఇంచు కదలని 22ఏ, చుక్కల భూముల ఫైళ్లు
- రెండు కోట్ల ఖాతాలో రైతుల మిగులు భూములు
- రీ సర్వేతో భూమిపై హక్కులు కోల్పోయిన రైతులు
- కందెన వేస్తేగానీ కదలని కొందరు అధికారుల కాళ్లు
- కొత్త కలెక్టర్ ఆనంద్.. సవాళ్లను ఎదుర్కొంటారా..?

ఇదీ సర్.. పరిస్థితీ..!



కలెక్టర్ ఆనంద్

పీజీఆర్ఎస్ అర్జీలకు ఉత్తుత్తి పరిష్కారాలు

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాకు కొత్త కలెక్టర్ వచ్చారు. శనివారం బాధ్యతలు చేపట్టి.. ఆదివారం రాజధానికి వెళ్లారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన కలెక్టర్ల సమీక్షలో పాల్గొన్నారు. తిరిగి బుధవారం విధుల్లో చేరారు. ఇక జిల్లా సమస్యలపై సర్వోన్నతాధికారి ఆనంద్ దృష్టి సారించాల్సి ఉంది. 'కొత్త జిల్లా.. కొత్త సమస్యలు.. అన్నీ తెలుసుకోవడానికి సమయం పడుతుంది..' అని కంగారు పడాల్సిన పనేలేదు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు (పీజీఆర్ఎస్) వచ్చిన అర్జీలను పరిశీలిస్తే ప్రధాన సమస్యలు ఏమిటో, అధికారుల పనితీరు ఎలా ఉందో ఇట్టే అర్థమైపోతుంది. సమస్యలలో 'రెవెన్యూ'దే సింహ భాగం. నిర్లక్ష్యం, అవినీతిలోనూ ఈ శాఖదే అగ్రస్థానం. భూ సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులకు సరైన పరిష్కారం లభించడం లేదు. చాలామంది అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లడం మానేశారు. రీ సర్వే రైతులకు కొత్త సమస్యలను తెచ్చిపెట్టింది. సొంత భూమిపై రైతులకు హక్కు లేకుండా పోయింది.

పరిష్కారం ఉత్తిదేనా..?

గడిచిన నాలుగు నెలల వ్యవధిలో కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు వచ్చిన వచ్చిన అర్జీలు, వాటి పరిష్కార గణాంకాలను పరిశీలిస్తే.. అధికారుల పనితీరు ఎలా ఉందో తెలిసిపోతుంది. రెవెన్యూ శాఖ పరిధిలో 5,340 అర్జీలు వస్తే.. 2,380 అర్జీలు పరిష్కారమైనట్లు చూపించారు. అంటే సగం కూడా పరిష్కారం కాలేదు. సర్వే సెటిల్‌మెంట్స్, ల్యాండ్ రికార్డ్స్ శాఖకు సంబంధించి 1,220 అర్జీలు వచ్చాయి. ఇందులో 678 అర్జీలు మాత్రమే పరిష్కారమయ్యాయి. పోలీసు శాఖకు 2,389 అర్జీలు వస్తే.. 2,125 వరకు పరిష్కారమయ్యాయి. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 538 అర్జీలలో 482 సమస్యలను పరిష్కరించినట్లు చూపించారు. 'పరిష్కరించాం' అని చూపినవాటిలోనూ చాలా వరకూ అర్జీదారులు సంతృప్తి చెందేలా పూర్తిస్థాయి పరిష్కారం కాలేదు. వచ్చిన అర్జీలలో 70 శాతం సమస్యలకు పరిష్కారం చూపకపోయినా.. 'మీ సమస్య పరిష్కారమైంది' అని మెసేజ్‌లు పంపుతున్నారని అర్జీదారులు వాపోతున్నారు. అవే సమస్యలపై పదే పదే బాధితులు కలెక్టరేట్ మెట్లు ఎక్కుతున్నారు. మండలాల పరిధిలోనే పరిష్కరించాల్సిన సమస్యలు కూడా కలెక్టరేట్ వరకూ వస్తున్నాయి. తహసీల్దారు కార్యాలయ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యమే దీనికి కారణమని చెప్పాల్సిన పని లేదు. ఉన్నతాధికారుల ఆదేశాలను దిగువస్థాయిలో ఖాతరు చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి.

చేయకనే చేసినట్లు.. కనికట్టు

గుమ్మఘట్ట మండలం తాళ్లకెర గ్రామానికి చెందిన చెందిన ఓ పెద్దాయన ఐదు నెలల క్రితం కలెక్టరేట్‌కు వచ్చారు. తమ ఊరిలో సీసీ రోడ్డు నిర్మించాలని కోరుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ ఇచ్చారు. దీనికి స్పందించిన అధికారులు.. 'ప్రతిపాదనలు పంపించాము. రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకుంటాము' అని ఆయనకు సమాధానం పంపించారు. రోడ్డు వేయలేదు. కానీ రికార్డుల్లో ఆ సమస్య పరిష్కారమైనట్లు చూపించారు. అదే విషయాన్ని తెలియజేస్తూ.. ఆ పెద్దాయనకు మెసేజ్ పెట్టారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే చాలా సమస్యలకు ఇలాంటి ఉత్తుత్తి పరిష్కారాలనే చూపుతున్నారు అధికారులు. 'అంత దూరం వెళ్లి కలెక్టర్‌ను కలిస్తే.. ఫలితం ఇదా..?' అని అర్జీదారులు ఆవేదన చెందుతున్నారు.



రెండు కోట్ల సమస్యలు

మిగులు భూముల సమస్య జిల్లాలో తీవ్రంగా ఉంది. రైతులకు సంబంధించిన మిగులు భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం ఆ భూములను రెండు కోట్ల ఖాతాలో పెట్టింది. ఇప్పుడు వాటిని తమ పేరుతో ఎక్కించుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. ఈ ఫైల్స్ కూడా తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయానికి, అక్కడి నుంచి కలెక్టరేట్‌కు రావాల్సిందే. జిల్లాలో దాదాపు 270 వరకు మిగులు భూములకు సంబంధించిన ఫైళ్లు కలెక్టరేట్‌కు వెళ్తే 100 ఫైళ్లకు మాత్రమే మోక్షం లభించిందని సమాచారం. వీటిలో కొన్ని సరైన డాక్యుమెంట్లు పొందుపరచని కారణంగా తిరస్కరణకు గురయ్యాయి. చాలా వరకు సరైన నివేదిక (రిపోర్ట్) లేని కారణంగానే రెజెక్ట్ అవుతున్నాయి. ఇక తహసీల్దార్ కార్యాలయాలు, ఆర్డీఓ కార్యాలయాల్లో మూలుగుతున్న ఫైల్స్‌కు లెక్కే లేదు.

రీ సర్వే కష్టాలు అనేకం..

గార్లదిన్నె మండలం జంబులదిన్నెకు చెందిన సుదర్శన్ రెడ్డి, ఆయన సోదరులకు సర్వే నంబరు 37లో 4.70 ఎకరాల భూమి జాయింట్ ల్యాండ్ పార్శిల్ మ్యాప్‌లో (ఎల్‌పీఎం) ఉంది. రీ సర్వే చేసిన సమయంలో అలా ఉంచారు. దీంతో వారు ఆ భూమిలో కనీసం 10 సెంట్లు కూడా ఎవరికీ విక్రయించలేని పరిస్థితి ఏర్పడింది. జాయింట్ ఎల్‌పీఎం ఉంటే రిజిస్ట్రేషన్ కుదరదని అంటున్నారు. ఈ వివాదాన్ని పరిష్కరించకుండా వదిలేశారు. సర్వేయర్లు, రీ సర్వే డీటీలు చాలా భూములను ఇలాగే ఉంచుతున్నారు. దీంతో బాధిత రైతులు జుట్టు పీక్కుంటున్నారు. జంబులదిన్నె రైతు.. తహసీల్దార్ కార్యాలయంలో టెన్-1 కాపీ అడిగితే ఇవ్వడం కుదరదని అంటున్నారట. 8-ఏ కాపీ కావాలని కోరితే కార్యాలయంలోనే లేదు అని సెలవిస్తున్నారట. రీ సర్వే జరిగిన, జరుగుతున్న ప్రతి గ్రామంలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఇక సబ్ డివిజన్, సర్వే చేయించుకోవాలంటే ముడుపులు కట్టి తీరాల్సిందే. లేదంటే కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తూ ఉండాల్సిందేనని రైతులు అంటున్నారు.

చుక్కలు చూపుతున్నారు..



జిల్లాలో 22ఏ, చుక్కల భూముల సమస్య కొరకరాని కొయ్యగా మారింది. 1954 కంటే ముందు పట్టా వచ్చిన భూములకు ఎన్‌ఓసీ కోసం దరఖాస్తు చేసుకుంటే, లెక్కలేనన్ని నిబంధనలు చెబుతున్నారు. అన్ని డాక్యుమెంట్లు పొందుపరిచినా నిరభ్యంతర పత్రం రావడం లేదు. తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయానికి రావడానికే ఆరు నెలలకు పైగా సమయం పడుతోంది. అక్కడి నుంచి కలెక్టరేట్‌కు వచ్చేందుకు మరో మూడు, నాలుగు నెలలు పడుతోంది. ఏదైనా డాక్యుమెంట్ లేదని కలెక్టరేట్‌లో తిరస్కరిస్తే.. ఇంక పరమపద సోపానంలో పెద్ద పాము మింగినట్లే.! ఆ ఫైల్ ఎక్కడుందో కనుక్కోడానికి అర్జీదారుడికి చుక్కలు కనిపిస్తాయి. అనంతపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు డివిజన్ల పరిధిలో చుక్కల భూములకు సంబంధించి 8 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 105 దరఖాస్తులకు మాత్రమే ఎన్‌ఓసీలు వచ్చాయి. మిగిలిన 7,894 ఫైల్స్ పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రతి వారం జరిగే డీఎల్‌సీ సమావేశానికి కొన్ని మండలాల నుంచి ఫైల్స్ కూడా వెళ్లడం లేదు. ఇక 22ఏ సమస్యలపై 2,233 మంది దరఖాస్తు చేసుకోగా కేవలం 112 ఫైల్స్ క్లియర్ అయ్యాయి. 2,121 ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. తహసీల్దారు కార్యాలయాల్లో పైసలిస్తేనే ఫైల్స్ ముందుకు కదులుతున్నాయని బాధితులు వాపోతున్నారు. కలెక్టర్ వినోద్ కుమార్ శిక్షణ నిమిత్తం వెళ్లడం, ఇతర కార్యక్రమాల కారణంగా దాదాపు రెండు నెలల నుంచి చుక్కల భూములు, 22ఏ సమస్యల గురించి పట్టించుకోలేదు.

ఉద్యోగోన్నతులు ఎప్పుడు...?

జూనియర్ అసిస్టెంట్‌లకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉద్యోగోన్నతులు ఇచ్చారు. కానీ ఇక్కడ మాత్రం ఇవ్వలేదని బాధితులు వాపోతున్నారు. రెవెన్యూ శాఖలో 32 సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తాము 30 మందే ఉన్నామని, అయినా ఉద్యోగోన్నతులు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఖజానా శాఖలో జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ ఇచ్చారు. రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు మాత్రం ఎందుకు పట్టించుకోవడం లేదో అంతుపట్టడం లేదు. కొత్త కలెక్టర్ తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

మహిళల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యం

- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ
- ఘనంగా స్వస్థ్ నారీ.. సశక్త్ పరివార్ ప్రారంభం



స్టాళ్లను తిలకిస్తున్న ఎంపీ, అధికారులు

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య భద్రతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో స్వస్థ్‌నారీ.. సశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. నోడల్ ఆఫీసర్ డాక్టర్ హేమలత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు ఎంపీతోపాటు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, డీసీహెచ్ఎస్ డేవిడ్ సెల్వరాజ్, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ విజయశ్రీ, ఆస్పత్రి సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, ఐసీడీఎస్ పీడీ నాగమణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేడుకలను ప్రారంభించిన అనంతరం ఎంపీ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ వైద్య కేంద్రాల్లో మహిళలకు అన్ని వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 17రోజులపాటు సాగే స్వస్థనారీ సశక్త్ పరివార్‌లో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తారని తెలిపారు. మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం శక్తివంతంగా ఎదుగుతుందన్నారు. ఆ దిశగా ప్రభుత్వం వైద్య, ఆరోగ్య శాఖద్వారా పథకాలను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. వేడుకలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎంపీతోపాటు అధికారులు పరిశీలించి, అభినందించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీఆర్ గేట్లకు మరమ్మతులు చేయాలి

- ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నప్ప

గార్లదిన్నె, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిడ్ పెన్నార్ రిజర్వాయర్ (ఎంపీఆర్) గేట్లకు తక్షణమే మరమ్మతులు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నప్ప యాదవ్ డిమాండ్ చేశారు. సీపీఐ స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఎంపీఆర్ నిర్వహణపై పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. డ్యాం గేట్లు మరమ్మతులకు నోచుకోకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. చాలాకాలంగా డ్యాం గేట్లకు లీకేజీలు ఉన్నా.. పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. దీంతో ప్రమాదం పొంచి ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు.. డ్యాం గేట్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకుడు శ్రీనాథ్ చౌదరి, సీపీఐ నాయకులు రాముడు, మధుయాదవ్, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

పరుగో పరుగు..!



గోడ దూకి పారిపోతున్న విద్యార్థి

శింగనమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కొందరు తరగతులు ప్రారంభం కాగానే గోడ దూకి పారిపోతున్నారు. పాఠశాల చుట్టూ సుమారు ఐదు అడుగుల ఎత్తైన ప్రహరీ ఉంది. అయినా ఏమాత్రం లెక్క చేయడం లేదు. పుస్తకాల సంచులను బయటకు విసిరేసి, గోడ దూకేస్తున్నారు. బడి నుంచి ఇంటికి వెళ్లిపోతున్నారా, లేక బయట తిరుగుతున్నారా అర్థంకాని పరిస్థితి. ఇదే తరహాలో ముగ్గురు విద్యార్థులు బుధవారం ఉదయం 11 గంటల సమయంలో గోడ దూకి పారిపోయారు. ఉపాధ్యాయులు గమనించి బయటకు వచ్చేలోగా మాయమయ్యారు. ఇంటర్వెల్ సమయంలో కొందరు విద్యార్థులు ఇలా పారిపోతున్నారని, వారిపై నిఘా ఉంచుతామని ఇన్‌చార్జి హెచ్ఎం త్యాగరాజు తెలిపారు. తల్లిదండ్రులు తరచూ పాఠశాలకు వెళ్లి తమ బిడ్డల గురించి విచారించాల్సిన అవసరం ఉంది. లేదంటే పెడతోవ పట్టే ప్రమాదం ఉంది.

-ఆంధ్రజ్యోతి, శింగనమల

టమోటా ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున



టమోటాను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో టమోటా ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం కక్కలపల్లి టమోటా మార్కెట్‌ను పరిశీలించారు. మల్లికార్జున మాట్లాడుతూ.. జిల్లాలో టమోటాను అధికంగా సాగు చేస్తున్నారన్నారు. గిట్టుబాటు ధరలేక రైతులు నష్టపోతున్నారన్నారు. పెట్టుబడులు కూడా దక్కక అప్పులపాలవుతున్నారన్నారు. మార్కెట్‌లో దళారులు రింగ్‌గా ఏర్పడి, రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం టమోటా ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి, రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నేతలు రామకృష్ణ, శ్రీకాంత్, సీపీఐ రూరల్ మండల కార్యదర్శి నరేష్, నాయకులు రెడ్డప్ప, అక్కులన్న, కుళ్లాయప్ప పాల్గొన్నారు.



డ్రోన్‌తో మందు పిచికారీ చేస్తున్న ఆపరేటర్

డ్రోనిజం..!



పురుగు మందు డ్రోన్‌లో పోస్తున్న రైతు

వ్యవసాయంలో సాంకేతిక విప్లవం.. డ్రోన్ ద్వారా పురుగు మందుల పిచికారీ

వ్యవసాయాన్ని సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అధునాతన వ్యవసాయ పరికరాలు, యంత్రాలు అందజేస్తోంది. ఈక్రమంలోనే పురుగు మందులు పిచికారీ చేయడానికి సబ్సిడీపై డ్రోన్‌లు అందజేసింది. వీటి ద్వారా రైతులు తక్కువ సమయంలో ఎక్కువ పంటకు పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. ఒక్క కిసాన్ డ్రోన్ యూనిట్ పూర్తి ధర రూ. 9.8 లక్షలు కాగా రైతు వాటా రూ. 1.96 లక్షలు చెల్లిస్తే మిగిలిన రూ. 7.84 లక్షలు ప్రభుత్వమే భరిస్తుంది. డ్రోన్ ట్యాంకు 12 లీటర్ల నీటి సామర్థ్యం కలిగి ఉంటుంది. విద్యుత్ చార్జింగ్ ద్వారా డ్రోన్ పని చేస్తుంది 40 నుంచి 60 నిమిషాల లోపు డ్రోన్ చార్జింగ్ ఫుల్ అవుతుంది.

- ఆంధ్రజ్యోతి, రాప్తాడు

రాప్తాడు మండలం హంపాపురం గ్రామంలోని అన్నదాత రైతు సేవా సంఘంలోని ఐదుగురు సభ్యులు కలిసి కిసాన్ డ్రోన్ తీసుకున్నారు. రెండు నెలల కిందట రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఏఓ కృష్ణ చైతన్య కిసాన్ డ్రోన్‌ను అన్నదాత రైతు సేవా సంఘం సభ్యులకు అందచేశారు. సంఘం సభ్యులు

డ్రోన్ ఆపరేటర్‌గా ఉపాధి

కిసాన్ డ్రోన్ ఆపరేటర్, కో ఆపరేటర్‌ను నియమించి రాప్తాడు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని దానిమ్మ, అరటి, చీనీ, వరి, వేరుశనగ, మామిడి వంటి అనేక రకాల పంటలకు పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. ట్రాక్టర్ స్ప్రేయర్లు, తైవాన్ స్ప్రేయర్లు కంటే కిసాన్ డ్రోన్ ద్వారా వేగంగా, సులభంగా మందులు పిచికారీ చేయవచ్చు. చదువుకుని ఉద్యోగాలు లేక ఖాళీగా ఉన్న యువకులు డ్రోన్ ఆపరేటర్‌గా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందుతున్నారు.

5 నిమిషాల్లోనే ఎకరా పొలానికి..

- రైతులకు వరంగా మారిన కిసాన్ డ్రోన్
- భారీ సబ్సిడీతో పంపిణీ చేస్తున్న ప్రభుత్వం

ఎకరా పొలానికి మందు పిచికారీ చేసినందుకు ఒక ట్యాంకు నీరు (12 లీటర్ల నీరు, పురుగు మందు) అవసరం. ఎకరాకు పురుగు మందు పిచికారీ చేసినందుకు రైతుల నుంచి రూ. 500 తీసుకుంటున్నారు. కిసాన్ డ్రోన్ ట్యాంకు 12 లీటర్ల నీటి సామర్థ్యం కలిగి ఉంటుంది. 12 లీటర్ల నీటిలో పురుగు మందు కలిసి ఒక ఎకరా వరికి 5 నిమిషాల్లోనే మందు పిచికారీ చేయవచ్చు. కిసాన్ డ్రోన్ ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశం తీసుకెళ్లేందుకు ప్రత్యేక స్టాండ్ అమర్చిన ద్విచక్రవాహనం లేదా ఆటో ఉపయోగిస్తున్నారు.

ఎకరాకు రూ. 500

వేగంగా, సులభంగా..

ఈ ఏడాది రెండు ఎకరాల్లో వరి సాగు చేశా. ప్రతిఏటా వరికి తైవాన్ స్ప్రేయర్ ద్వారా మందు పిచికారీ చేయాలంటే చాలా కష్టంగా ఉండేది. మోకాలు లోతు బురద మడిలో నడిచి మందు పిచికారీ చేయాలంటే కూలీలు రారు. ఈ ఏడాది కిసాన్ డ్రోన్ అందుబాటులో ఉండటంతో రెండు ఎకరాలకు రెండు ట్యాంకులు మందు పిచికారి చేయించా. పది నిమిషాల్లో పని పూర్తయింది. డ్రోన్ వలన వేగంగా, సులభంగా పూర్తయింది. రెండు ట్యాంకులు మందు పిచికారి చేసినందుకు రూ. వెయ్యి చెల్లించా.



- హరినాథ్‌రెడ్డి, రైతు, ఎం. చెర్లోపల్లి

మండలానికి ఒకటి

పురుగు మందులు సులభంగా, వేగంగా తక్కువ ఖర్చుతో పిచికారీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అధిక శాతం సబ్సిడీతో కిసాన్ డ్రోన్ అందజేస్తోంది. ప్రస్తుతానికి మండలానికి ఒకటి చొప్పున ప్రభుత్వం మంజూరు చేస్తోంది. అన్ని రకాల పంటలకు డ్రోన్ ద్వారా పురుగు మందులు పిచికారీ చేయవచ్చు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి.

- కృష్ణ చైతన్య, ఏఓ, రాప్తాడు

అగ్రికల్చర్ డిప్లొమా చేశా



హంపాపురం ఆదరణ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా అగ్రికల్చర్, బీఎస్సీ హార్టికల్చర్ పూర్తి చేశా. ఉద్యోగం లేక ఖాళీగా ఉన్నా. గుంటూరు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 10 రోజులు శిక్షణ తీసుకుని ప్రభుత్వ సర్టిఫికెట్ పొందా. ప్రస్తుతం డ్రోన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నా. ఇప్పటి వరకూ 100 ట్యాంకులకు పైగా మందు పిచికారీ చేశా. సంఘం సభ్యులు నాకు నెలకు రూ.15వేలు, సహాయకుడికి రూ.10వేలు జీతం చెల్లిస్తున్నారు.

- వినయ్‌కుమార్ డ్రోన్ ఆపరేటర్, హంపాపురం

నేడే అమరావతికి పయనం

డీఎస్సీ ఎంపిక అభ్యర్థుల కోసం 45 బస్సుల ఏర్పాటు



ఏర్పాట్లపై చర్చిస్తున్న డీఈఓ, ఇతర అధికారులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ- 2025లో ఎంపికైన కొత్త టీచర్లను అమరావతికి తీసుకెళ్తున్నారు. ఏడేళ్ల తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి టీచర్ల నియామకాలను చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన అన్ని జిల్లాలకు చెందిన టీచర్లు, వారికుటుంబ సభ్యులతో 19న రాష్ట్ర ప్రభుత్వం.. అమరావతిలో సమావేశం ఏర్పాటు చేసింది.ఆ మేరకు జిల్లాలో ఎంపికైన 755 మంది కొత్త టీచర్లు, వారి తరఫున ఒక్కో కుటుంబ సభ్యుడిని అమరావతికి తీసుకెళ్తున్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేపట్టారు. జోన్-4 స్థాయిలో జిల్లాకు చెందిన అభ్యర్థులు పీజీటీ, టీజీటీలుగా ఎంపికైన వారితోపాటు కుటుంబ సభ్యులను ఇక్కడి నుంచే అమరావతికి తరలిస్తున్నారు. అందు కోసం 45 బస్సులు ఏర్పాటు చేశారు. ప్రతిబస్సు పర్యవేక్షణకు నలుగురు లైజనింగ్ అధికారులను నియమించారు. వారికి పర్యవేక్షణపై జిల్లా సైన్స్ సెంటర్‌లో సమావేశం ఏర్పాటుచేసి నిబంధనలను తెలియజేశారు. ప్రత్యేక ఐడీ కార్డులు ఇవ్వనున్నారు. గురువారం ఉదయం 6 గంటలకే పీవీకేకే కాలేజీలో బస్సులు సిద్ధంగా ఉంటాయనీ, అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులతో అక్కడకు చేరుకోవాలని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. అనంతపురం, కర్నూలు మీదుగా ఆత్మకూరు, డోర్నాల, వినుకొండ, నరసరావుపేట, గుంటూరుకు బస్సులు చేరుకుంటాయని డీఈఓ వివరించారు.

సీఎస్ సమీక్ష

మెగా డీఎస్సీ-2025లో ఉద్యోగాలను సాధించినవారిని రాజధానికి పంపేందుకు జిల్లా నుంచి 45 బస్సులు ఏర్పాటు చేశామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ఏపీ సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు, విద్యాశాఖ అధికారులు మొత్తం 2100 మంది వరకు అమరావతికి వస్తారని తెలిపారు. బస్సులు గురువారం ఉదయం బయలుదేరి, సాయంత్రానికి అమరావతికి చేరుకుంటాయని వివరించారు. వీసీలో డీఈఓ ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

అవధుల్లేని ఆనందం

టీచర్, కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన ఎస్కేయూ విద్యార్థులు

బీఎడ్ కళాశాలలో సంబరాలు



ఉద్యోగాలు సాధించినవారితో వీసీ అనిత, కళాశాల ప్రిన్సిపాల్ సోమశేఖర్ తదితరులు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కానిస్టేబుల్ సెలక్షన్స్, డీఎస్సీలో ఎస్కేయూ బీఎడ్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. ఉద్యోగాలు కొల్లగొట్టారు. ఆరుగురు చొప్పున ఎస్జీ టీచర్, కానిస్టేబుల్ ఉద్యోగాలు పొందారు. మరికొందరు స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి కళాశాలలో బుధవారం అభినందన సభ నిర్వహించారు. ఉద్యోగాలు సాధించిన వారి ఆనందానికి అవధుల్లేవు. వారిని వీసీ అనిత, రెక్టార్ వెంకటనాయుడు అభినందించారు. జ్ఞాపికలను అందజేశారు. యూనివర్సిటీకి, కళాశాలకు మంచి పేరు తెచ్చారని హర్షం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ సోమశేఖర్ మాట్లాడుతూ.. కళాశాల విద్యార్థులు ఇంతమంది ఒకేసారి ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల పర్యవేక్షకుడు లక్ష్మణరావు, అధ్యాపకులు రాజేశ్వరి, శివానంద, భాస్కర్, నారాయణ స్వామి, సుధాకర్, సాల్మన్‌రాజ్, అనిత, సంజీవరాయుడు, శకుంతల పాల్గొన్నారు.

కష్టానికి ఫలితం దక్కింది: తలారి సురేష్



ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో 87.95 మార్కులు సాధించా. ఎస్ఏ ఫిజికల్ సైన్స్ సబ్జెక్టులో జిల్లా మొదటి ర్యాంకు దక్కింది. తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించా. ఇక్కడి వాతావరణం, అధ్యాపకుల బోధనలు ఉద్యోగ సాధనకు ఎంతో ఉపయోగపడ్డాయి. కష్టపడి చదివినందుకు మంచి ఫలితం దక్కింది. ఎంతో సంతోషంగా ఉంది.

ఆరింటిలో అర్హత సాధించా: శ్రీనివాసులు



ఐదేళ్లుగా ఉపాధ్యాయ నోటిఫికేషన్ కోసం ఎదురుచూశా. నోటిఫికేషన్ వెలువడిన తరువాత కష్టపడి చదివా. ఇటీవల డీఎస్సీలో ఆరింటిలో అర్హత సాధించా. ఎస్ఏ మ్యాథమ్యాటిక్స్‌లో రాష్ట్రస్థాయి 19వ ర్యాంకు దక్కింది. జిల్లాలో ఐదో ర్యాంకు వచ్చింది. ఎస్ఏ మ్యాథమ్యాటిక్స్‌తోపాటు ఫిజికల్ సైన్స్, టీజీటీలో మ్యాథమ్యాటిక్స్, ఫిజికల్ సైన్స్‌లో ఉద్యోగానికి అర్హత సాధించా. మ్యాథమ్యాటిక్స్‌పై మక్కువ ఉండడంతో ఎంపిక చేసుకున్నా. గంతలో రైల్వేలో ఉద్యోగం వచ్చినా వెళ్లలేదు.

అధ్యాపకుల సూచనలు పనికొచ్చాయి: సాయికృష్ణ నాయుడు



డీఎస్సీలో ఎస్ఏ సోషల్‌తోపాటు టీజీటీ ఉద్యోగావకాశం వచ్చింది. కళాశాలలో చదువుకున్నందుకు సంతోషంగా ఉంది. అధ్యాపకుల బోధనలు బాగున్నాయి. వారి సూచనలు ప్రిపరేషన్‌లో చాలా ఉపయోగపడ్డాయి. ఉద్యోగ సాధనకు సహాయపడ్డాయి. నాతోపాటు చదువుకున్న స్నేహితులకు ఉద్యోగాలు రావడం సంతోషంగా ఉంది.

అర్చకుల సమస్యలన్నీ పరిష్కరిస్తాం

- దేవదాయ శాఖ సహాయ కమిషనర్ తిరుమల రెడ్డి



మాట్లాడుతున్న దేవదాయశాఖ సహాయ కమిషనర్ తిరుమల రెడ్డి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు కృషి చేస్తామని దేవదాయ, ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ తిరుమల రెడ్డి హామీ ఇచ్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లా అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో అర్చక సమావేశం నిర్వహించారు. సమాఖ్య అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు నేతృత్వంలో అర్చకులు తమ సమస్యలను సహాయ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ధూపదీప నైవేద్య పథకం, ఉపనయనం, డెత్ గ్రాట్యుటీ, 43 రిజిస్ట్రేషన్, అర్చకులకు పంట నష్ట పరిహారం, వాతావరణ బీమా తదితర పథకాలు అందించడంలో అధికారులు విఫలమవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే తల్లికి వందనం పథకం అర్చక కుటుంబాలకు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. వీటన్నింటి పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని కోరారు. దీనికి సహాయ కమిషనర్ తిరుమల రెడ్డి మాట్లాడుతూ.. అర్చక కుటుంబాలకు సంక్షేమ పథకాల వర్తింపు తమ పరిధిలో ఉండదన్నారు. ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అర్చకుల సమస్యలను ప్రత్యేక గ్రీవెన్స్ ద్వారా దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లావ్యాప్తంగా ఈఓలు తమ పరిధిల్లోని ఆలయాల్లో సమస్యలపై దృష్టి సారించేలా సూచనలిస్తామన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వన్నూరుస్వామి, పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రధానార్చకుడు సీతారామశర్మ, ప్రసాద్, కందుకూరు రామాంజనేయులు, పలుకూరు రవికుమార్, మారుతీప్రసాద్, వెంకటగిరయ్య, తిరుపతయ్య, చంద్రమౌళి, విజయ్‌కుమార్, రాజన్న, మల్లికార్జున, వేణుగోపాలస్వామి, రమణ, భార్గవ, నందాచార్యులు, నవీన్, చేతన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన నాయీబ్రాహ్మణ విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరంగయ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో 480 మార్కులకుపైగా, ప్రైవేటు స్కూళ్లలో 520కిపైగా సాధించినవారు అర్హులన్నారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో ప్రభుత్వ కళాశాలల్లో 850, ప్రైవేటు కాలేజీల్లో 900 మార్కులు సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 30వ తేదీలోపు మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు ప్రతులను ఎం. శ్రీనివాసులు ఆర్టీసీ, డోర్ నం. 18-1-406, వేణుగోపాల్ నగర్, అనంతపురం చిరునామాకు పంపాలన్నారు. ఎంపికైన విద్యార్థులకు అక్టోబరు 19వ తేదీన జీసెస్‌నగర్‌లోని జయమనెమ్మ కల్యాణమండపంలో పురస్కారాలు అందజేస్తామన్నారు. వివరాలకు 9441222874 నంబరులో సంప్రదించాలన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

అనంతపురంరూరల్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు రోడ్డులో గల ఎస్ఎల్ఎస్ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 19వ తేదీ మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల సీఈఓ వెంకటరామిరెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో బీఎస్సీ కంప్యూటర్స్, బీకాం కంప్యూటర్స్, బీబీఏ, బీసీఏ, ఎంబీఏ, ఎంసీఏ కంప్యూటర్స్ 2023, 2024, 2025 విద్యా సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన వారు పాల్గొనవచ్చన్నారు. ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఆయా కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9440469476 నంబరులో సంప్రదించాలన్నారు.

మీ ఫొటోకు ఓ దండం!

- స్మార్ట్ రైస్ కార్డు పంపిణీలో చోటానాయకుల ఫొటో షూట్
- తలలు పట్టుకుంటున్న రేషన్‌షాపు డీలర్లు

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీకి ఫొటో షూట్ ప్రతిబంధకంగా మారుతోంది. అధికారపార్టీకి చెందిన కొందరు చోటా నాయకులు కార్డుల పంపిణీ కార్యక్రమంలో తాముండాలంటూ షో చేస్తుండటమే ఇబ్బందులకు కారణమవు తున్నట్లు సమాచారం. ఈక్రమంలో రేషన్‌కార్డుదారులను ఒక చోట చేర్చడానికి, ఫొటో తీయించడానికే సమయం సరిపోతోందని, ఇక స్మార్ట్‌కార్డులు ఎప్పుడు పంపిణీ చేయాలంటూ డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 15నుంచి స్మార్ట్ రైస్ కార్డులను రేషన్‌కార్డుదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. తొలి రోజు అశోక్‌నగర్‌లో జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ కార్డులు పంపిణీ చేశారు. ఆ సమయంలో స్థానిక అధికారపార్టీ నాయకులు పాల్గొన్నారు. అదే రోజు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకుల సమక్షంలో స్మార్ట్ రైస్ కార్డులను పంపిణీ చేశారు. అయితే ప్రతి రోజూ స్థానిక నాయకులు ఫొటో కోసం ఎగబడుతున్నట్లు సమాచారం. ఫొటోషూట్ తతంగం ముగియడానికి రోజుకు 3గంటల సమయం పడుతున్నట్లు సమాచారం. దీంతో రైస్ కార్డుల పంపిణీ సక్రమంగా సాగడం లేదని సమాచారం. జిల్లా కేంద్రం, కొన్ని పట్టణాలు, మండల కేంద్రాల్లో ఈ తరహా షో ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది. దీంతో డీలర్లు...'బాబు ఒక రోజైతే పర్లేదు ప్రతి రోజూ ఇలాగే చేస్తూ పోతే కార్డులు పంపిణీ చేయలేం...మీకో దండం..మీ ఫొటోకో దండం' అంటున్నారు. వాస్తవానికి ఈనెల 6నే రైస్ కార్డులను పంపిణీ చేయాల్సింది. కానీ ఆలస్యం చేసి 15నుంచి పంపిణీ చేస్తున్నారు.

హక్కుల సాధనే ఐద్వా ధ్యేయం

సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ ప్రసూన

అనంతపురం టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళల హక్కుల సాధనే ఐద్వా ధ్యేయమని సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ ప్రసూన అన్నారు. అనంతపురం వేదికగా అక్టోబరు 13, 14, 15 తేదీల్లో నిర్వహించే ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలను పురస్కరించుకుని నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆమె ప్రసంగించారు. 1936లో కృష్ణా జిల్లాలో ఆంధ్ర మహిళా సంఘంగా ఏర్పడి, 1981లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘంగా(ఐద్వా) రూపాంతరం చెందిందని తెలిపారు. మహిళల సమస్యల పరిష్కారానికి ఐద్వా ఆవిర్భావం నుంచి కృషి చేస్తోందని అన్నారు. దేశవ్యాప్తంగా రెండు కోట్ల మంది సభ్యులున్న ఐద్వా, మహిళల రక్షణ కోసం పోరాటాల ద్వారా అనేక చట్టాలను సాధించిందని అన్నారు. ఆస్తి హక్కు, వరకట్న వేధింపుల నిరోధక చట్టం, లైంగిక వేధింపుల నిరోధక చట్టం, నిర్భయ, గృహహింస వంటి అనేక చట్టాలను సాధించుకోవడానికి ఐద్వా తోడ్పడిందని అన్నారు. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ సాధన కోసం అలుపెరుగని పోరాటం చేశామని అన్నారు. మహిళలపై అత్యాచారాలు, హత్యలు, లైంగిక వేధింపులు, ఆర్థిక వివక్ష, అసమానతలకు వ్యతిరేకంగా ఐద్వా పోరాడుతోందని అన్నారు. అనంతపురంలో నిర్వహించే రాష్ట్ర మహాసభల్లో మహిళలు, విద్యార్థినులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభల నేపథ్యంలో అక్టోబరు 9, 10, 11వ తేదీల్లో జిల్లా కేంద్రంలోని కృష్ణ కళా మందిర్‌లో ప్రతి రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నాగజ్యోతి, డాక్టర్ విశ్వనాథ రెడ్డి, డాక్టర్ పల్లవి, ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల కార్యదర్శి నిర్మలమ్మ, ప్రిన్సిపాల్ సరిత, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ మాధవి, ఐద్వా జిల్లా నాయకురాలు గీత, నగర కార్యదర్శి అశ్విని పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ ప్రసూన

తొలి వాస్తుశిల్పి విశ్వకర్మ

జయంతి వేడుకలలో ఎంపీ అంబికా



నగరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణులు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): విశ్వంలోనే తొలి వాస్తు శిల్పి విశ్వకర్మ అని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పాతూరు వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో బుధవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంతకుముందు ఉదయం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంగాచారి శంఖం ఊది ప్రారంభించారు. అనంతరం ఆలయ ఆవరణలోని కల్యాణమండపంలో సీనియర్ న్యాయవాది గురుప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జేసీ శివనారాయణశర్మ, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత విశ్వకర్మ చిత్రపటానికి పూలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విశ్వకర్మ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషదాయకమన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. జేసీ మాట్లాడుతూ విశ్వకర్మను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడవాలన్నారు. చేతి, కులవృత్తుల వారు నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ హిందూ సంస్కృతిలో విశ్వకర్మకు ప్రముఖమైన స్థానం ఉందని తెలిపారు. వేడుకల్లో భాగంగా బీసీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థినులు సంప్రదాయ నృత్యరూపకాలతో అలరించారు. ప్రదర్శనానంతరం విద్యార్థులను ముఖ్యఅతిథులు జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ స్వప్న, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంగాచారి, డీఆర్‌ఓ మలోల, ఆలయ చైర్మన్ మౌళి ఆచారి, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూకొఠారి, బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ సుభాషిని, డీపీఆర్‌ఓ బాలకొండయ్య, అర్బన్ తహసీల్దార్ హరిప్రసాద్, పరిశ్రమలశాఖ జీఎం శ్రీనివాస్‌యాదవ్, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

వసతుల కల్పనకు ప్రాధాన్యం

- సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ



వివరాలు వెల్లడిస్తున్న సమగ్రశిక్ష ఏపీసీ శైలజ

అనంతపురంవిద్య, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కేజీబీవీలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ పేర్కొన్నారు. సమగ్రశిక్ష ద్వారా చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి బుధవారం ఆమె విలేకరులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న ప్రతివిద్యార్థికి ఉచితంగా పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, యూనిఫామ్, బూట్లు, నోటు బుక్కులు అందజేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 36,66,533 విద్యా కిట్లను అందజేసినట్లు వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో రూ.53కోట్లతో వివిధ రకాల సివిల్ పనులు చేపట్టినట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పాఠశాలలు, ఎమ్మార్సీలు, కాంప్లెక్స్‌లకు నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. విద్యా ప్రమాణాలు పెంపునకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కేజీబీవీల్లో పాల్ కార్యక్రమం ద్వారా పిల్లలకు ట్యాబ్‌లు ఇచ్చి అందులో ఏఐ ద్వారా బోధన చేయిస్తున్నట్లు తెలిపారు. విద్యాశక్తి, విద్యాపథం కార్యక్రమాలు నిర్వహిస్తూ స్పెషల్‌క్లాస్‌లు ఏర్పాటు చేసి, రోజుకొక సబ్జెక్టుకు టెస్టులు పెడుతున్నామన్నారు. పాల్‌కార్యక్రమం అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలోను అమలు చేస్తున్నట్లు తెలిపారు. పీఎంశ్రీ స్కూల్స్ జిల్లాలో 42ఉండగా కొత్తగా ఉరవకొండ ఏఆర్ఎస్‌డబ్ల్యుఆర్‌ఈఐఎస్, గుత్తిఏపీమోడల్‌స్కూల్స్‌కు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎస్ఎస్ఏ ద్వారా అన్నిపాఠశాలలోను ఒకేషనల్ కోర్సులు ఏర్పాటు చేసి ప్రత్యేక టీచర్లను నియమించి పిల్లలకు నేర్పిస్తామన్నారు. అనంతజిల్లాలోని కేజీబీవీలను ఆంధ్రప్రదేశ్‌లో ఆదర్శంగా నిలపడానికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని ఏపీసీ శైలజ తెలిపారు.

నేడు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు

కొత్తచెరువు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలను గురువారం నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి తనూజ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పోటీలు ఉంటాయన్నారు. ఉదయం 11గంటల నుంచి గూగుల్ మీట్ ద్వారా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తిగల విద్యార్థులు పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 9492843184 నంబరులో సంప్రదించాలన్నారు.

క్రైం కార్నర్

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య


అబ్బారెడ్డి మృతదేహం

గుత్తి, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): గుత్తి ఆర్ఎస్‌లోని రైల్వే స్టేషన్‌లో గూడ్స్ రైలు కింద పడి అబ్బారెడ్డి (52) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని కురువ వీధికి చెందిన అబ్బారెడ్డి ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తుండేవారు. కొంతకాలంగా గుండె సంబంధిత జబ్బుతో బాధపడుతుండేవారు. దీంతో మనస్తాపం చెంది బుధవారం గుత్తి రైల్వే స్టేషన్‌లో గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. తన చావుకు ఎవరూ బ్యాధులు కారనీ, అనారోగ్యం కారణంగానే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు సూసైడ్ నోట్ రాసి, జేబులో ఉంచుకుని అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఘటనాస్థలాన్ని రైల్వే పోలీసులు పరిశీలించి, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు. అబ్బారెడ్డికి భార్య, కూతురు ఉన్నారు.

విద్యార్థిని..


ఆశ (ఫైల్)

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెచ్చిరి గ్రామంలో కుటుంబసభ్యులు మందలించారనే మనస్తాపంతో ఆశ(17) బుధవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. బంధువులు, కుటుంబసభ్యులు తెలిపిన మేరకు చిత్రదుర్గం జిల్లా మొలకాల్మూరు తాలూకా బొమ్మలింగంపల్లి గ్రామానికి చెందిన మల్లికార్జున, నిర్మల దంపతుల కుమార్తె ఆశ ఇంటర్ విద్యను అభ్యసిస్తోంది. పదిరోజుల కిందట మెచ్చిరి గ్రామానికి చెందిన మేనమామ తిప్పేస్వామి ఇంటికి ఆమె వచ్చింది. అయితే ఏపని చేయకుండా ఉండటంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పామిడి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో 44వ జాతీయ రహదారి పక్కన నడుచుకుంటూ వెళ్తున్న మహిళ(45)ను గుర్తుతెలియని వాహనం బుధవారం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసుల వివరాల మేరకు... స్థానిక ఓల్డ్ ఫుడ్డీ రెస్టారెంట్ ఎదురుగా అనంతపురం వైపు నుంచి గుత్తి వైపునకు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం.. మహిళను ఢీ కొట్టి వెళ్లిపోయింది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. మతిస్థిమితం లేని ఓ మహిళ జాతీయ రహదారిపై తిరుగుతూ ఉంటుందనీ, చనిపోయినది ఆమే అయి ఉండొచ్చని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖం గుర్తుపట్టని విధంగా ఛిద్రం కావడంతో ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించి, ఎంపీడీఓ తేజోత్స్న సమక్షంలో పంచనామా చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో 18 నెలలు జైలు

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఒక ఇంట్లో దొంగతనం చేసిన కేసులో కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గానికి చెందిన మంజప్పగారి సోమశేఖర్ అనే ముద్దాయికి కళ్యాణదుర్గం ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు 18 నెలలు జైలు శిక్ష విధించినట్లు సీఐ యువరాజు బుధవారం తెలిపారు. 2024 జనవరి 14న కళ్యాణదుర్గం శంకరప్ప తోటలోని ఒక ఇంట్లో సోమశేఖర్ ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశాడు. అప్పటి సీఐ హరినాథ్ అతన్ని అరెస్ట్ చేసి.. కేసు నమోదు చేశారు. అనంతరం ఆ చోరీతో సంబంధం ఉన్నట్లు అనుమానంతో సోమశేఖర్ భార్యను ప్రస్తుత సీఐ యువరాజు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో ఛార్జ్‌షీటు వేశారు. విచారించిన ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జడ్జి భాను నేరం రుజువుకావడంతో సోమశేఖర్‌కు 18 నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. కాగా అతని భార్యపై నేరం రుజువు కాకపోవడంతో ఆమెకు ఎలాంటి శిక్ష పడలేదు. కేసును ఛేదించిన సీఐ యువరాజు, సీఐ హరినాథ్, కానిస్టేబుల్ విజయ్‌లను ఎస్పీ, డీఎస్పీలు అభినందించారు.

డెంగీతో చిన్నారి మృతి


హర్షిత్ (ఫైల్)

గుత్తి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): గుత్తి ఆర్ఎస్‌లోని కర్నూలు రోడ్డులో డెంగీతో చిన్నారి హర్షిత్(2) బుధవారం మృతిచెందాడు. గుత్తి ఆర్ఎస్‌లో నివాసముంటున్న వెంకటరమణ, మౌనిక దంపతుల కుమారుడు హర్షిత్‌కు వారం రోజుల క్రితం జ్వరం రావడంతో స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కర్నూలుకు తరలించగా డెంగీ అని నిర్ధారించారు. అక్కడి నుంచి హైదరాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ చిన్నారి మృతిచెందాడు. చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

హత్య కేసు నిందితుల అరెస్టు


అరెస్టయిన నిందితులు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగిన చిన్న పెద్దన్న హత్య కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు, బుక్కరాయసముద్రం మండలం పొడరాళ్లకు చెందిన చిన్న పెద్దన్న, రాణినగర్‌కు చెందిన అంజినమ్మతో సహజీవనం చేసేవాడు. ఆమె వద్ద డబ్బులు తీసుకుని, తిరిగి ఇవ్వలేదు. ఈ విషయమై గొడవపడి ఆమెను కొట్టాడు. దీంతో ఆగ్రహించిన అంజినమ్మ, తన కొడుకు రమేష్, మరికొందరితో కలసి చిన్న పెద్దన్నను హత్య చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన పోలీసులు, బుధవారం సాయంత్రం గుత్తి రోడ్డులోని కేటీఆర్ ఫంక్షన్ హాల్ వద్ద నిందితులు అంజినమ్మ, ఆమె కుమారుడు రమేష్, ఒకటో రోడ్డుకు చెందిన పటాన్ సొహైల్, మురళీ కార్తీక్, శివకుమార్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి బైకును స్వాధీనం చేసుకున్నారు.

సువిధమైన సురక్ష..!

- గ్రామీణ ప్రజలకు తపాలా బీమాతో ధీమా
- తక్కువ ప్రీమియం... ఎక్కువ బోనస్
- అందుబాటులో ఆరు రకాల పథకాలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజల కోసం తపాలాశాఖ ఆరు రకాల బీమా పథకాలను అమలు చేస్తోంది. తక్కువ ప్రీమియం, ఎక్కువ బోనస్‌లతో పాలసీదారులకు లాభాల భరోసాను ఇస్తోంది. సురక్ష, సువిధ, సుమంగళ్, సంతోష్, గ్రామప్రియ, చిల్డ్రన్ పాలసీ పేర్లతో ఆరు పథకాలను ప్రవేశపెట్టింది. ఒక్కో పథకం ద్వారా రూ. 10 వేల నుంచి రూ. 10 లక్షల వరకూ పాలసీలు చేసుకునే అవకాశం కల్పించింది. వీటిలో ఒక్కో పథకానికి బోనస్‌ను రూ.60లు, రూ.48లు, రూ.45లు చొప్పున అందించనుంది. లబ్ధిదారుడు మూడేళ్ల పాటు జరిపిన చెల్లింపులపై రుణ సదుపాయం కల్పిస్తోంది. ప్రీమియం చెల్లిస్తున్న సమయంలో పాలసీదారుడు మరణిస్తే వారు కట్టిన పాలసీ మొత్తాన్ని ఒకేసారి నామినీకి అందజేస్తారు. ఈ పథకాల్లో చేరదలచిన వారు ఆధార్, పాన్‌కార్డు కలిగి ఉండాలి. జిల్లాలోని ఏ పోస్టాఫీసులోనైనా ప్రీమియం చెల్లించవచ్చు. ఆదాయపు పన్ను రాయితీ, నామినేషన్ సౌకర్యం, ఆన్‌లైన్‌లో ప్రీమియం చెల్లించే అవకాశాన్ని తపాలా శాఖ కల్పించింది.



ప్రధాన తపాలాశాఖ కార్యాలయం

చిల్డ్రన్ పాలసీ: ఈపాలసీలో చేరే పిల్లలకు సంబంధించిన తల్లిదండ్రులు సురక్ష, సువిధ పథకాలలో లబ్ధిదారులై ఉండాలి. ఆయా పథకాల్లో ఉన్న తల్లిదండ్రుల పిల్లలకు మాత్రమే ఈ పథకం వర్తించనుంది. అదీ కూడా తల్లిదండ్రుల వయస్సు 45 సంవత్సరాలలోపు ఉండాలి. ఈ పథకంలో 5 నుంచి 20 సంవత్సరాలలోపు ఉన్న పిల్లలకు పాలసీ వర్తిస్తుంది. ఈ పథకంలో రూ.20 వేల నుంచి రూ.లక్ష వరకూ పాలసీని నిర్ణయించారు. ఈ పథకంలో బోనస్ రూ.48గా నిర్ణయించారు.

గ్రామప్రియ: ఈ పథకంలో 10 సంవత్సరాల పాలసీ మాత్రమే నిర్ణయించారు. ఇందులో 20 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల వారిని అర్హులుగా చేర్చారు. ఈ పథకంలో రూ.45 బోనస్ రూపంలో పాలసీకి వర్తించనుంది. ఈ పథకంలో 10 సంవత్సరాల పాలసీలో మనీబ్యాక్ కింద 4, 7 సంవత్సరాలకొకసారి 20 శాతం బోనస్ లభించనుంది. మిగిలిన మొత్తాన్ని పాలసీ ముగిసే సమయంలో బోనస్‌ను అదనంగా జోడించి అందించనున్నారు.

సువిధ : సువిధ పథకం కింద 10 వేల నుంచి రూ. 10 లక్షల వరకూ పాలసీలను నిర్ణయించారు. 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారిని ఈ పథకానికి అర్హులుగా చేర్చారు. ఈ పాలసీని సురక్ష పథకంలో మాదిరి 60 సంవత్సరాల వరకూ నిర్ణయించుకోవచ్చు. లేదా సంతోష్ పథకంలో నిబంధనల మేరకు కన్వర్ట్ చేసుకునే అవకాశం కల్పించారు. సురక్ష పథకం కింద ప్రీమియం చెల్లింపులు ఐదేళ్ల పాటు చేయాల్సి ఉంటుంది. ఆ తరువాత ఒక సంవత్సరంలోపు సంతోష్ పథకం కింద కన్వర్ట్ అయ్యే అవకాశం కల్పించారు. సురక్ష పథకం కింద అయితే రూ. 60లు బోనస్... సంతోష్ పథకం కింద కన్వర్ట్ చేసుకుంటే రూ.48 బోనస్ లభిస్తుంది. లబ్ధిదారుడి చెల్లింపులు బట్టి బోనస్‌లు వర్తిస్తాయి.

సంతోష్: సంతోష్ పథకం కింద 10 వేల నుంచి రూ.10 లక్షల వరకూ పాలసీలను నిర్ణయించారు. 19 నుంచి 55 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారిని ఈ పథకానికి అర్హులుగా చేర్చారు. ఈ పథకంలో బోనస్ కింద రూ. 1000కి రూ.48 వర్తిస్తుంది. ఈ పథకంలో 19 సంవత్సరాల వయస్సు గల లబ్ధిదారుడు పథకంలో చేరితే మెచ్యూరిటీని 35, 40, 45, 50, 55, 58, 60 సంవత్సరాలకు నిర్దేశించుకోవచ్చు. ఇక్కడ మెచ్యూరిటీ ఏ సంవత్సరం వరకూ అయితే నిర్దేశించుకుంటారో... ఆ సంవత్సరం నుంచి మరో ఐదేళ్లపాటు వేచి ఉండాల్సి ఉంటుంది. అనంతరం పాలసీ మొత్తానికి రూ.48 బోనస్‌ను అదనంగా జోడించి లబ్ధిదారుడికి అందజేస్తారు. రూ.10 లక్షలు పాలసీ చేసిన లబ్ధిదారుడికి బోనస్‌తో కలుపుకొని మొత్తం రూ.29.68 లక్షలు పాలసీ మొత్తం వర్తిస్తుంది.

సురక్ష : సురక్ష పథకం కింద రూ.10 వేల నుంచి రూ.10 లక్షల వరకూ పాలసీలను నిర్ణయించారు. 19 నుంచి 55 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారిని ఈ పథకానికి అర్హులుగా చేర్చారు. ఈ పథకంలో బోనస్ కింద రూ. 1000కి రూ.60లు వర్తిస్తుంది. 60 సంవత్సరాల వరకూ ప్రీమియం చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. అనంతరం 80 ఏళ్ల తర్వాత రూ. 10 లక్షలు, అందుకు సంబంధించి రూ.60 బోనస్‌తో కలిపి మెచ్యూరిటీ మొత్తాన్ని లబ్ధిదారుడికి అందజేస్తారు. లబ్ధిదారుడు మరణిస్తే ఆ మొత్తాన్ని నామినీకి అందజేస్తారు. రూ.10 లక్షలు పాలసీ 60 సంవత్సరాల పాటు చెల్లిస్తే బోనస్‌తో కలుపుకొని దాదాపు రూ.34.60 లక్షలు లబ్ధిదారుడికి అందుతాయి. మూడేళ్ల తర్వాత పాలసీదారుడికి రుణ సదుపాయం కూడా ఉంటుంది.

సుమంగళ్: ఈ పథకంలో రూ.10 వేల నుంచి రూ.10 లక్షల వరకూ పాలసీలను నిర్ణయించారు. 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారిని ఈ పథకానికి అర్హులుగా చేర్చారు. ఈ పథకంలో రూ. 45లు బోనస్ లభిస్తుంది. పథకంలో రెండు రకాల బోనస్‌లను నిర్ణయించారు. 15 సంవత్సరాల పాలసీను ఎంచుకున్న లబ్ధిదారుడికి మనీబ్యాక్ కింద 6 సంవత్సరాలకొకసారి, 9 సంవత్సరాలకొకసారి, 12 సంవత్సరాలకొకసారి 20 శాతం మనీ బ్యాక్ రూపంలో బోనస్ లభించనుంది. అనంతరం మిగిలిన బోనస్‌ను పాలసీ గడువు ముగిసిన అనంతరం అందజేస్తారు. 20 సంవత్సరాల పాలసీని ఎంచుకున్న లబ్ధిదారుడికి మనీ బ్యాక్ కింద 8 సంవత్సరాలు, 12 సంవత్సరాలు, 16 సంవత్సరాలకొకసారి 20 శాతం చొప్పున మనీ బ్యాక్ రూపంలో బోనస్ లభిస్తుంది. ఈ పథకంలో ఎలాంటి రుణ సదుపాయం ఉండదు.

పనులు నాణ్యంగా ఉండాలి: ఎస్ఈ


మాట్లాడుతున్న పీఆర్ ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): నాణ్యతా లోపాలు లేకుండా పనులు చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు తమ సిబ్బందిని ఆదేశించారు. జడ్పీ ఆవరణలోని పంచాయతీరాజ్ ఈఈ కార్యాలయంలో ఈఈ ప్రభాకర్‌రెడ్డితో కలిసి బుధవారం ఆయన జిల్లాలోని డీఈలతో సమీక్ష నిర్వహించారు. సబ్‌డివిజన్ల వారిగా పనుల పురోగతిపై ఆరా తీశారు. నిర్మాణంలోగాని, బిల్లుల మంజూరులోగాని సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. కొందరు డీఈలు వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎస్ఈ దృష్టికి తెచ్చారు. జిల్లాలో ఉపాధి పథకం కింద చేపట్టిన పలు అభివృద్ధి పనుల బిల్లుల అప్‌లోడ్‌కు సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. సమస్యలు ఏమైనా కానీ వాటిని అధిగమించి ముందుకు సాగాలన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన వినతులకు ఎప్పటికప్పుడు పరిష్కారాలు చూపించాలని ఆదేశించారు. సమావేశంలో పీఏ టూ ఎస్ఈ రాజేంద్రప్రసాద్, పీఏ టు ఈఈ గురిమూర్తిరావు, డీఈలు మురళీ, రసూల్, లక్ష్మీనారాయణ, కృష్ణజ్యోతి, ఎల్లమనాయుడు, సుధాకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ విద్యార్థులకు ఉద్యోగాలు


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో వీసీ, రెక్టార్ తదితరులు

అనంతపురంరూరల్, జూలై17(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న పలువురు విద్యార్థులు.. ఉద్యోగాలు సాధించారు. ఆ విద్యార్థులను బుధవారం జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య అభినందించారు. వీసీ మాట్లాడుతూ.. ఉద్యోగాలు పొందిన విద్యార్థులు.. జూనియర్స్‌కు ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలన్నారు. ఉద్యోగాలు రాని విద్యార్థులు మరింత కష్టపడి సామర్థ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి మాట్లాడుతూ.. కళాశాలలో జూలై, ఆగస్టులో పలు కంపెనీలు ప్రాంగణ నియామకాలు చేపట్టాయన్నారు. మోస్చిప్ టెక్నాలజీలో నలుగురు విద్యార్థులు ఉద్యోగాలు సొంతం చేసుకున్నారన్నారు. వార్షిక వేతనం రూ.ఆరు లక్షలు అందుకోనున్నట్లు తెలిపారు. డెల్టా ఎక్స్ కంపెనీలో ఒకరికి ఉద్యోగం దక్కిందనీ, వార్షిక వేతనం రూ.7లక్షలు, ఇన్ఫోసిస్‌లో మరొకరికి రూ.6.25లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం


ఇర్ఫాన్

పరిగి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీతారాంపురం కాలనీకి చెందిన ఇర్ఫాన్ అనే యువకుడు ఆదివారం నుంచి కనిపించడం లేదని తల్లి ముంతాజ్ బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రంగడు తెలిపిన మేరకు ఇర్ఫాన్ హిందూపురంలో టెంపో డ్రైవర్‌గా పని చేస్తుండేవాడు. గత మూడు రోజుల నుంచి ఇంటికి రాకపోవడంతో టెంపో యాజమాన్యంతో తల్లి ముంతాజ్ విచారించారు. దీంతో వారు ఇర్ఫాన్ తమ వద్దకు రాలేదని చెప్పడంతో కిడ్నాప్ చేసి ఉంటారనే అనుమానంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. యువకుడిని ఎవరైనా గుర్తిస్తే 9440908879కు సమాచారం అందించాలన్నారు.

11 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 11 మండలాల్లో మంగళవారం వర్షం కురిసింది. అత్యధికంగా నార్పలలో 6.2 సెంటీమీటర్లు, యల్లనూరు 1.8, కూడేరు 1.7, గార్లదిన్నె 1.4, బుక్కరాయసముద్రం 1.1 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 0.9 సెంటీ మీటర్లలోపు వర్షపాతం నమోదైంది.

బాధ్యతలు చేపట్టిన డీఎఫ్ఓ

అనంతపురం క్రైం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీశాఖ అధికారిగా చక్రపాణి బుధవారం బాధ్యతలు చేపట్టారు. డీఎఫ్ఓ విఘ్నేష్ అప్పావు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో శ్రీసత్యసాయి జిల్లా డీఎఫ్ఓ చక్రపాణికి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయనకు జిల్లా అటవీశాఖ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పొలంలో కొండచిలువ

కదిరి, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): తలుపుల మండలం గజ్జలప్పగారిపల్లి సమీపాన వేరుశనగ పొలంలో బుధవారం కొండచిలువ కనిపించింది. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గజ్జలప్పగారిపల్లిలో వేరుశనగ పంటను తొలగిస్తుండగా కొండచిలువ కనిపించింది. భయపడిన కూలీలు వెంటనే అటవీ అధికారి నరసింహమూర్తికి విషయం తెలిపారు. వెంటనే ఆయన పొలం వద్దకు వచ్చి కొండ చిలువను పట్టుకుని సురక్షితంగా అటవీ ప్రాంతంలో వదిలారు. ఆయన మాట్లాడుతూ.. కొండచిలువతో ప్రాణహాని ఉండదనీ, ఇది రైతు నేస్తమన్నారు. జాగ్రత్తగా ఉండాలనీ, చంపకూడదని సూచించారు. పొలాల్లో కనిపిస్తే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలని అన్నారు.


కొండచిలువను పట్టుకున్న అటవీ శాఖ అధికారి

సత్యసాయి బాటే.. పరమావధి

- సేవాదళ్ జాతీయ అధ్యక్షుడు నరసింగారావు

అలరించిన మధుర స్మరణం


ప్రసంగిస్తున్న నరసింగారావు

పుట్టపర్తి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా సేవా బాటే తమకు పరమావధి అని సేవాదళ్ జాతీయ అధ్యక్షుడు నరసింగారావు పేర్కొన్నారు. పర్తి యాత్రగా ప్రశాంతి నిలయానికి చేరుకున్న మలేషియా భక్తులు సాయికుల్వంత్ సభామండపంలో బుధవారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో నరసింగారావు మాట్లాడుతూ.. సత్యసాయి ప్రేమతత్వం, ఆధ్యాత్మిక బోధనలు కోట్లాది మంది భక్తులకు శాంతిజీవనంగా మారాయన్నారు. సత్యసాయి చూపిన సేవాబాటలో సామాజిక సేవలు చేపడుతున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, తాగునీరు వంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మధుర స్మరణం పేరిట సంగీత కచేరి నిర్వహించారు. వాయిద్య గానంతో భక్తులను అలరింపజేశారు.

వనరుల సంరక్షణతోనే అభివృద్ధి

- డీపీఓ నాగరాజనాయుడు



శిక్షణలో మాట్లాడుతున్న డీపీఓ నాగరాజనాయుడు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) సహజ వనరుల సంరక్షణతోనే అభివృద్ధి సాధ్యమని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజనాయుడు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో పర్యావరణ పరిరక్షణ, జీవన ప్రమాణాలపై రెండు రోజుల పాటు డిప్యూటీ ఎంపీడీఓలు, కార్యదర్శులు, సర్పంచులకు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం, ఎఫ్ఈఎస్ (ఫౌండేషన్ ఫర్ ఎకలాజికల్ సెక్యూరిటీ) సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఎఫ్ఈఎస్ సంస్థ ప్రతినిధి భక్తర్ వలి మాట్లాడుతూ సంస్థ తరపున పర్యావరణ పరిరక్షణపై అనేక కార్యక్రమాలు చేపట్టి తగిన అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామీణ పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడం, మహిళల్లో అట్టడుగు వర్గాల భాగస్వామ్యం పెంచడంలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ శిక్షణకు హాజరైన అధికారులు ఇక్కడ తెలుసుకున్న అంశాలను విధి నిర్వహణలో అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సదాశివ, స్నేహేష్, ధనశేకరన్, తులసీ, డీడీఓ నాగశివలీల, డిప్యూటీ ఎంపీడీఓలు వెంకటనాయుడు, అశ్వత్థనాయుడు, ఆనంద్‌ప్రసాద్, విజయ్‌కుమార్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులపై కమిషనర్ ఆగ్రహం

- 29మందికి షోకాజ్, 9మందికి మెమోలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలపై అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు కేటాయించిన విధులు, లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న 20మందికి షోకాజ్ నోటీసులు, 9మందికి మెమోలు జారీ చేశారు. రవికుమార్ (వార్డు 3), సి ప్రసాద్ (13), ప్రకాష్‌రెడ్డి (14), లక్ష్మీకాంత్ (22), గౌతమిగీత (28), ముత్యాలయ్య (31), ప్రకాష్ (34), శ్రీహరి (35), అపర్ణ (36), ఊహ (42), రియాజ్‌భాషా (43), రాజేష్‌రెడ్డి (52), గంగాదేవి (55), రాజేంద్రప్రసాద్ (57), శశికళ (59), శ్రీవాణి (60), విమలేష్ (62), మౌనిక (63), శ్రీధర్‌రెడ్డి (66), ఝాన్సీలక్ష్మి (74)లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వార్డు సచివాలయాల అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు శివశంకర్ (వార్డు 10), నాగలలిత (12), ధర్మేంద్ర (18), ముత్యాలయ్య (31), అపర్ణ (36), ప్రదీప్ (38), శ్రీవాణి (60), శ్రీహరి (64), రాజశేఖర్ (67)లకు మెమోలు జారీ చేశారు. నిర్లక్ష్యం వీడి పురోగతి సాధించని పక్షంలో శాఖాపరమైన చర్యలకు వెనుకాడబోమని కమిషనర్ హెచ్చరించారు.

వాహన మిత్ర అమలుపై హర్షం



సీఎం, డీసీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలతో ఆటోడ్రైవర్లు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వాహనమిత్ర అమలు చేస్తామని ప్రకటించడం పట్ల ఆటో డ్రైవర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు బుధవారం కురుగుంట గ్రామంలో గురువారం వారు టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సీఎం, చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే పరిటాల సునీత చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల మాజీ కన్వీనర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. దసరా పండుగ నుంచి ఈ పథకం అమలు చేస్తానని సీఎం చెప్పడం పట్ల ఆటోడ్రైవర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. అనంతరం గ్రామంలో రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, డీలర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఏపీఐఐసీ డైరెక్టర్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌ను ఏపీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(ఏపీఐఐసీ) డైరెక్టర్ చల్లా లక్ష్మీప్రసాద్ బాబు కలిశారు. స్థానిక నివాసంలో బుధవారం ఆయన ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టీడీపీకి, ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని లక్ష్మీప్రసాద్ బాబుకు సూచించారు.



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న లక్ష్మీప్రసాద్ బాబు

డ్వామా పరిపాలన అధికారి బాధ్యతల స్వీకరణ

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): డ్వామా పరిపాలన అధికారిగా రామకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గుమ్మగట్ట ఎంపీడీఓగా పని చేస్తున్న రామకృష్ణ డీఎల్‌డీఓగా ఉద్యోగోన్నతి పొందారు. ఈ నేపథ్యంలో డ్వామా పీడీ కార్యాలయ పరిపాలన అధికారిగా బదిలీ చేయడంతో ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. ముందుగా డ్వామా పీడీ సలీం బాషా, ఏపీడీ సుధాకర్‌రెడ్డిలనుకలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.



డ్వామా పీడీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న రామకృష్ణ

‘ఉదయ్ భాస్కర్ సేవలు మరువలేనివి’



ఉదయ్ భాస్కర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏడాది పాటు ఉమ్మడి జిల్లాకు డీఎస్‌డీఓగా ఉదయ్‌భాస్కర్ అందించిన సేవలు క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని డీఎస్‌డీఓ మంజుల కొనియాడారు. ఏడాది పాటు ఇన్‌చార్జి డీఎస్‌డీఓగా పనిచేసిన శ్రీసత్యసాయి జిల్లా డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్‌కు బుధవారం సాయంత్రం నగరంలోని అశోక్‌నగర్‌లోగల డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో సన్మానసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్‌డీఓ మంజుల మాట్లాడుతూ క్రీడలు, క్రీడాకారుల పట్ల నిబద్ధతతో, తన నైపుణ్యతను నేర్పిస్తూ శిక్షణ ఇచ్చిన ఉదయ్‌భాస్కర్ ప్రతి ఒక్కరికీ ఆదర్శమని తెలిపారు. అనంతరం ఆయన్ను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో డీఎస్ఏ సూపరింటెండెంట్ దేవమణి, శాప్ కోచ్‌లు జబీవుల్లా, అనీల్, మహ్మద్‌ఆలీ, సంధ్య, లక్ష్మీదేవి, నరేష్, చలపతి, ప్రతాప్, పెద్దక్క, రాఘవేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు మానస



శింగనమల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు మండలంలోని సోదనపల్లి జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థి బి.మానస ఎంపికైంది. మానస ఇటీవల అనంతపురంలో స్కూల్స్ గేమ్ ఫెడరేషన్ ఆధర్యంలో జరిగిన రగ్బీ గేమ్ అండర్ 14 బాలికల విభాగంలో ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికైంది. త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆమె పాల్గొననుంది. మానస ఎంపిక పట్ల పాఠశాల హెచ్ఎం సిరాజుద్దీన్, పీడీ బయపరెడ్డి ఉపాధ్యాయులు బుధవారం అభినందలు తెలిపారు.

యాదవ సంఘం మండల కమిటీ ఎంపిక

రామగిరి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): యాదవ సంఘం మండల నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మండలంలోని యాదవలందరూ కలిసి గరిమేకలపల్లిలోని వీర ఓబమ్మఆలయంలో సమావేశం నిర్వహించారు. ఇందులో యాదవసంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పరంధామయాదవ్ ఆధ్వర్యంలో మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపికచేశారు. మండల అధ్యక్షుడిగా మంగాపురం ఆదినారాయణ, ఉపాధ్యక్షులుగా ఆర్‌కొత్తపల్లి నాగేంద్ర, కొండాపురం అక్కులప్ప, ప్రధానకార్యదర్శిగా పూజారి చిన్నఅక్కులప్ప, ప్రచార కార్యదర్శిగా కొత్తగాది కుంట కిష్టప్ప, కోశాధికారిగా తిమ్మాపురం గోవర్దన, కార్యదర్శులుగా గరిమేకల పల్లి గద్ది నారాయణ, కంచికుంట నరేశ్, గంతిమర్రి కందక ఎర్ర ఓబయ్య, పేరూరు నాగేంద్ర, సుద్దకుంటపల్లి నరసింహమూర్తిని ఎంపిక చేశారు. నూతన కమిటీ సభ్యులతో సంఘం సీనియర్ నాయకులు మాట్లాడుతూ.. యాదవుల సమస్యల పరిష్కారం కోసం అందరం ఐక్యమత్యంగా పనిచేద్దామని సూచించారు. రాజకీయ పార్టీలు యాదవులకు రాజకీయంగా తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం: ఎంపీడీఓ



తల్లిమడుగులలో బోరుబావి వద్ద కొలతలు వేస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి స్పందన

కనగానపల్లి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజల తాగునీటి సమస్యను తీరుస్తామని ఎంపీడీఓ అనిల్‌కుమార్ తెలిపారు. తల్లిమడుగుల గ్రామంలో పంచాయతీ బోరుబావిని వైసీపీ నాయకులు ఆక్రమించడంతో గ్రామస్థులకు తాగునీటి సమస్యలు తలెత్తాయి. దీనిపై బుధవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో ఎంపీడీఓ అనిల్‌కుమార్ వెంటనే స్పందించి రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి గ్రామానికి చేరుకుని వైసీపీ నాయకులు ఆక్రమించిన బోరుబావిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ బోరుబావి రహదారిలో ఉందా.. లేక ఆక్రమణదారుల స్థలంలో ఉందా అని నిర్ధారించుకునేందుకు సర్వేయర్ కరుణాకర్‌తో కొలతలు వేయించారు. దీనిపై పూర్తిగా విచారించి తల్లిమడుగుల గ్రామస్థుల తాగునీటి సమస్యను తీరుస్తామని ఎంపీడీఓ తెలిపారు.

ఈ పంట నమోదు తప్పనిసరి

● రైతులకు జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ సూచన

గార్లదిన్నె, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సాగుచేసిన ప్రతి పంటకు ఈ పంట నమోదు తప్పని సరిగా చేసుకోవాలని రైతులకు జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ సూచించారు. గార్లదిన్నెలో బుధవారం వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఉమామహేశ్వరమ్మ పాల్గొని అక్కడి పలు పంటలను పరిశీలించారు. అనంతరం పాల్గొని మాట్లాడుతూ.. రైతులు సాగు చేసిన పంటలు ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతింటే ప్రభుత్వం మంజూరు చేసే నష్టపరిహారం వర్తించడానికి తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. నెలాఖరులోపు చేసుకోవాలన్నారు. అదేవిధంగా పంటలకు యూరియా తగిన మోతాదులో వినియోగించుకోవాలన్నారు. మోతాను మించి వేస్తే పంటలు దిగుబడిని కోల్పుతాయన్నారు. అనంతరం ప్రభుత్వం అమలు చేసే పథకాలను రైతులకు వివరించారు. మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, ఏఈఓ హరి, వీహెచ్ఏ నాగలత, రైతులు పాల్గొన్నారు.

నామాలలో పొలం పిలుస్తోంది

చెన్నేకొత్తపల్లి: మండలంలోని నామాల గ్రామంలో బుధవారం వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ పలు పంట పొలాలను పరిశీలించారు. అనంతరం ఏడీఏ లక్ష్మానాయక్ మాట్లాడారు. రైతులు ఈ పంట నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. అలాగే పంటల సాగులో యూరియా వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ఏఓ మురళీకృష్ణ, రైతు సేవా కేంద్రం ఎంపీఈఓ రామ్మోహన్, రైతులు పాల్గొన్నారు.



గార్లదిన్నెలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఉమామహేశ్వరమ్మ

మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెట్టాలి

● ఐసీడీఎస్ పీడీ నాగమణి సూచన

రాప్తాడు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ పీడీ నాగమణి సూచించారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం స్వస్థ్ నారి, సశక్త్ పరివార్ అభియాన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీ మాట్లాడుతూ.. మహిళలు మంచి ఆహారం తీసుకోవాలన్నారు. అలాగే క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబ శక్తివంతంగా ఉంటుందని అన్నారు. కుటుంబాలు ఆరోగ్యంగా ఉంటే దేశ భవిష్యత్తు ప్రకాశవంతంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సాకే తిరుపాలు, జోనల్ మలేరియా అధికారి శ్రీనివాసులు, కన్సల్టెంట్ హేమంత్, నోడల్ అధికారి గోపీచంద్, టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సీడీపీఓ ఉమాశంకరమ్మ, సీహెచ్ఓ శివప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ నాగమణి

●నార్పల: మండలంలోని బీపప్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారి, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో వైద్యుడు హజీరా మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. తర్వాత మహిళలు, పురుషలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ సంజమ్మ, ఎంపీటీసీ సభ్యుడు పద్మాకర్ రెడ్డి, సీడీపీఓ భారతి, ఎంపీహెచ్ఈఓ మల్లికార్జున, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

●రామగిరి: మండలకేంద్రంతో పాటు పేరూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో వైద్యసిబ్బంది, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్వస్థనారీ శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు ప్రతాప్ మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఈ సందర్భంగా అక్టోబరు 2వతేదీ వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక వైద్యసేవలు అందించనున్నట్లు చెప్పారు. ఆరోగ్య సమస్యలున్న వారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తామన్నారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించి నిత్యం తీసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లతాకిరణ్, కేజీబీవీ ఎస్ఓ స్వర్ణలత, టీడీపీ నాయకులు శ్రీరాములునాయక్, పేపర్‌శీన, విశ్వనాథ్ పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నాణ్యత పరిశీలన



బీటీ రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న క్యూసీ ఈఈ మల్లికార్జున మూర్తి

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని కొత్తచెరువు మండలం తలమర్ల నుంచి ఈరగంపల్లి వరకు రూ.94 లక్షల నాబార్డు నిధులతో నూతనంగా నిర్మాణం చేపట్టిన బీటీ రోడ్డు నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ అధికారులు బుధవారం పరిశీలించారు. క్వాలిటీ కంట్రోల్ ఈఈ మల్లికార్జునమూర్తి ఈఈ శంకరయ్యతో కలిసి నాణ్యతను పరిశీలించారు. అందుకు అనుగుణంగా నమూనాలను సేకరించారు. ల్యాబ్‌లో పరిక్షల అనంతరం నాణ్యత ధృవీకరణ పత్రం జారీ చేస్తామని ఈఈ తెలిపారు. కార్యక్రమంలో పీఐయూ డీఈ, కదిరి ఏఈఈ తో పాటు స్థానిక అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీఎంఎస్ కార్యాలయంలో భగవాన్ విశ్వకర్మ జయంతిని భారతీయ మజ్దూర్ సంఘ్ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం సంఘ్ జిల్లా కన్వీనర్ బీఎల్ నరసింహం మాటాడుతూ.. కార్మికుల వారసుడు, మూలపురుషుడు విశ్వకర్మ అని తెలిపారు. ప్రభుత్వం విశ్వకర్మ జయంతిని జాతీయ కార్మికదినోత్సవంగా ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు మాణిక్యం, లక్ష్మయ్య, జయప్ప, రమేష్, రామాంజి, కార్మికులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల నివాళి

శింగనమల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పెరవలి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు సాధిక్ వలి భార్య జమ్మబీ(59)అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, సీనియర్ నాయకుడు మారుతీనాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు గుర్రం లక్ష్మీనారాయణ, నాయకులు చింతబరి దొర, చెన్నయ్య వెంటకరాముడు, నాగరాజు, శ్రీనివాసులు నాయుడు తదితరులు గ్రామానికి వెళ్లి ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆర్థిక సాయం

శింగనమల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): వివాహ నిమిత్తం ఓ నిరుపేద కుటుంబానికి శింగనమల మార్కెట్ యార్డు చెర్మన్, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని తరిమెల గ్రామానికి చెందిన షేక్ షాజాది , షేక్ అక్బర్‌వలి దంపతులు తమ కుమారుడు అన్వర్‌కు వివాహాన్ని ఖాయం చేశా రు. అయితే వారిది నిరుపేద కుటుంబం కావడంతో దండు శ్రీనివాసులు బుధవారం జిల్లాకేంద్రంలో వారికి రూ.10వేలు ఆర్థిక సాయాన్ని వివాహ ఖర్చుల నిమిత్తం అందజేశారు. కార్యక్రమంలో తరిమెల ఉపసర్పంచ్ పుల్లయ్య, టీడీపీ నాయకుడు పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

పగిలిన పీఏబీఆర్ పైపులైన్

● నేడు నగరంలోని నీటి సరఫరాకు అంతరాయం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ నుంచి నగరానికి నీటి సరఫరా చేసే పైపులైన్ పగిలి నీరు పెద్దఎత్తున లీకేజీ అవుతోంది. దీంతో గురువారం నగరంలో నీటిసరఫరాకు అంతరాయం ఏర్పడనుందని నీటిని పొదుపుగా వాడుకోవాలని అనంత నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి బుధవారం కోరారు. స్థానిక బళ్లారి బైపాస్ సర్కిల్లో పైపులైన్ లీకేజీ అవుతోందని, ఇప్పటికే ఇంజనీర్లు, కార్మికులు మరమ్మతులు చేస్తున్నారని తెలిపారు. ఎస్ఈ రాజశేఖర్ నేతృత్వంలో ఇంజనీర్లు, కార్మికులు పైపులైన్ మరమ్మతు పనులు వేగంగా చేస్తున్నారన్నారు. నీటి సరఫరా అంతరాయానికి నగరవాసులు సహకరించాలని కోరారు.



పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న కార్మికులు, ఇంజనీర్లు

అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

● విద్యార్థులకు జేఎన్‌టీయూ వీసీ సూచన

అనంతపురం రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు సూచించారు. స్థానిక జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో బుధవారం ఇన్నొవేషన్ కౌన్సిల్ (ఐఐసీ)స్టార్టప్స్ చాలెంజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా వర్సిటీ వీసీ సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య హాజరయ్యారు. వీసీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమరావతిలో రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్‌ను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తోందన్నారు. స్టార్టప్ కంపెనీలకు, ముఖ్యంగా ఐటీ, ఉత్పత్తి రంగాల్లో వారికి మద్దతు ఇవ్వడం ద్వారా ఆవిష్కరణలకు ఊతమిస్తోందన్నారు. అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన ఎలా మేధాసంపత్తితో ఆలోచన చేసేవారో.. విద్యార్థులు కూడా అలాగే ఆలోచించాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, ప్రోగ్రాం కోఆర్డినేటర్ అరుణ, యూనివర్సిటీ డైరెక్టర్లు, కళాశాల విభాగాధిపతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ సుదర్శన్‌రావు

రక్తదాన శిబిరం ప్రారంభం

కళాశాల డిస్పెంసరీలో జాతీయ సేవాపథకం, ఇండియన్ రెడ్‌క్రాస్ రక్తనిధి సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. వీసీ సుదర్శన్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. డీఎంహెచ్ఓ దేవి, అడిషనల్ డీఎంహెచ్ఓ అనుపమ జేమ్స్, జాతీయ సేవాపథకం కార్యక్రమ అధికారి మమత, రెడ్ క్రాస్‌సొసైటీ జిల్లాశాఖ వైస్ చైర్మన్‌లక్ష్మణ్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

అనంతపురంరూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకుతోటపల్లిలో బుధవారం రేషన్ లబ్ధిదారులకు టీడీపీ నాయకులు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ మాట్లాడుతూ.. ప్రజా అవసరాలకు అనుగుణంగా సాంకేతికను అందుబాటులోకి తీసుకురావడం సీఎం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఏటీఎం తరహాలో క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్‌కార్డులను ప్రభుత్వం ఇస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు వేణుగోపాల్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షెక్షావలి నాయుడు, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీదేవి, చియ్యేడు సింగిల్ విండో అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, క్లస్టర్ ఇంచార్జి రాగేమురళి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రమణ, శ్రీసత్యసాయి జిల్లా కుమ్మర శాలివాహన సాధికారసమితి కన్వీనర్ రామాంజనేయులు, తెలుగుయువత మండల అధ్యక్షుడు అనిల్ చౌదరి, నాయకులు డీసీబాబు, వెంకటరాముడు, చలపతి, చంద్రశేఖర్, పూలనాగరాజు, గణేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు నారాయణ స్వామి పాల్గొన్నారు.

●గార్లదిన్నె: మండలంలోని కోటంక, గార్లదిన్నె, మర్తాడు తదితర గ్రామాల్లో రెవెన్యూ అధికారులు, డీలర్లు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోటంక సర్పంచు మేడాపురం లక్ష్మీ మాట్లాడుతూ... నిత్యవసర సరుకుల పంపిణీలో అక్రమాలకు తావులేకుండా ఉండేందుకు స్మార్ట్ రేషన్ కార్డులు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బండారు ఈరమ్మ, సీఎస్‌డీటీ కంబక్క, టీడీపీ నాయకులు సుంకన్న, ఎర్రిస్వామి, సుధాకర్, నాగరాజు, నాగేంద్ర, నరసింహులు, కేశవయ్య, రామాంజనేయులు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

●శింగనమల: మండలంలోని పెద్ద మట్లగొంది, ఆకులేడు, జూల్కాకాలువ, పెరవలి, అలంకరాయనిపేట గ్రామాల్లో టీడీపీ నాయకులు, అధికారులు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. క్యాక్రమంలో సర్పంచ్ రమేష్, నాయకులు నాగభూషణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

●నార్పల: మండలంలోని బొందలవాడ గ్రామంలో టీడీపీ జిల్లా నాయకుడు, ఉపసర్పంచు ఆలం వెంకటనరసానాయుడు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, వీఆర్వో దాదాపీర్, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



ఆకుతోటపల్లిలో స్మార్ట్‌రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు, అధికారులు



గార్లదిన్నె మండలం కోటంకలో పంపిణీ..



నార్పల మండలం బొందలవాడలో ..

‘సుప్రీం తీర్పుపై పునరాలోచించాలి’



వినతిపత్రం ఇస్తున్న ఆపస్ నాయకులు

అనంతపురంవిద్య, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సర్వీస్‌లో ఉన్న టీచర్లకు టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి అని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కేంద్రం పునరాలోచించాలని ఆపస్ ఉపాధ్యాయసంఘం జిల్లా అధ్యక్షురాలు కళ్యాణి, జిల్లాప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌కు వచ్చి ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వీస్‌లో ఉండి 2010కు ముందు పదోన్నతులు తీసుకున్నవారందరూ తప్పనిసరిగా టెట్ రాసి ఉత్తీర్ణులు కావాల్సిందేనని ఇచ్చిన తీర్పుతో దేశవ్యాప్తంగా టీచర్లు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ విషయం ప్రధానమంత్రి దృష్టికి తీసుకుపోవాలనే ఈవినతులు ఇస్తున్నామన్నారు. వినతులను కేంద్రానికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో ఆపస్‌నాయకులు శివప్రసాద్‌నాయుడు, పోతలయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల చైర్మన్

అనంతపురం రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచానపల్లి సమీపంలో గల ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు వివిధ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. దీంతో బుధవారం ఆ విద్యార్థులను పాఠశాల చైర్మన్ అరుణ్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ వినూత్నరెడ్డి అభినందించారు. అనంతలక్ష్మి అంతర్జాతీయ పాఠశాలలో ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి స్విమ్మింగ్ అండర్-14బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన విష్ణుశ్రీజ, బాలుర విభాగంలో మహేంద్రరెడ్డి రాష్ట్ర స్థాయికి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. అలాగే ఆర్డీటీ మైదానం జరిగిన ఆర్చరీ అండర్ 17బాలుర విభాగంలో ధ్రువరెడ్డి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



కనగానపల్లిలో పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కనగానపల్లి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): గర్భిణులు పౌష్టికాహారం తప్పక తీసుకోవాలని, అప్పుడే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి తెలిపారు. మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం 8వ రాష్ట్రీయ పోషణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో సూపర్‌వైజర్ పాల్గొని పౌష్టికారం వల్ల కలిగే లాభాలను వివరించారు. కనుక నిత్యం గర్భిణులు, బాలింతలు వాటిని తప్పక తీసుకోవాలని సూచించారు. తర్వాత అంగన్‌వాడీ సిబ్బంది పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించారు. అనంతరం అందరు కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి బానురేఖ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

● గార్లదిన్నె: మండలకేంద్రంలోని 3వ అంగన్‌వాడీ కేంద్రంలో 8వ రాష్ట్రీయ పోషణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ వాణి శ్రీ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అందచేస్తే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు తప్పక తీసుకోవాలని, అప్పుడే ఆర్యోగంగా ఉంటారని తెలిపారు. తల్లిపాల పై, వ్యాధినిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భం గా బీజేపీ నాయకులు బుధవారం స్థానిక టవర్‌క్లాక్ వ ద్ద మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ ఎటువంటి హంగూఆర్భాటం లేకుండా పేద ప్రజలకు ఉపయోగపడేవిధంగా సేవా కార్యక్రమాలతో ప్రధాని జన్మదిన వేడుకలు జరుపుకుంటున్నామని తెలిపారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. బీజేపీ సీనియర్ నాయకులు చిరంజీవిరెడ్డి, కిరణ్‌గౌడ్, రత్నమయ్య, అశోక్‌రెడ్డి, లలిత్‌కుమార్, వెంకటేశ్వరరెడ్డి, జగన్మోహన్, పైలా నరసింహయ్య, ఈశ్వర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో బీజేపీ నాయకులు


● అనంతపురం ప్రెస్‌క్లబ్: ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా అఖిల గాండ్ల తెలికుల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంక్షేమ సంఘం నాయకులు నగరంలోని ఆర్టీఓ కార్యాలయ సమీపంలో ఉన్న మీనాక్షమ్మ ఇన్‌క్లూజివ్ డెవలప్‌మెంట్ సెంటర్(బాలికల అంధ ఆశ్రమం)లో కేక్ కట్ చేసి విద్యార్థినులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహులు, అఖిల గాండ్ల తెలికుల రాష్ట్ర నాయకురాలు గాండ్లవిశాలాక్షి, సంఘం నాయకులు వెంకటరమణ, విజయలక్ష్మి, చిగిచెర్ల నాగరాజు, కేవీ కుమార్, హిమగిరి వరప్రసాద్ ముత్యాలు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● రామగిరి: మండలంలోని పేరూరులో ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లను పంపిణీచేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు శ్రీనాథ్, కోడి రామ్మూర్తి, వెంకటేశులు, వడ్డేశీన, వడ్డెఅంజి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల్లో రిజర్వేషన్ల బిల్లు ప్రవేశ పెట్టాలి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు విద్యాసంస్థల్లో ఎస్సీ , ఎస్టీ బీసీ రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టాలని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవి శంకర్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీఓహోంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతవారం విద్యారంగంపైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ రిపోర్ట్‌లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 (5) ప్రకారం ఎస్సీఎస్టీ, బీసీ రిజర్వేషన్లు అన్ని విద్యాసంస్థలతో పాటు ప్రైవేటు విద్యాసంస్థలకు కూడా వర్తింపజేయాలని సిఫారసు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు రిజర్వేషన్లు లేక, ఆర్థిక స్థోమత లేక చేరలేకపోతున్నారన్నారు. 2008లో సుప్రీంకోర్టు రిజర్వేషన్లకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా నేటికీ అమలు కాకపోవడానికి పాలకుల నిర్లక్ష్యమే కారమని తెలిపారు. అటు పార్లమెంట్‌లోనూ, ఇటు అసెంబ్లీలోనూ ప్రైవేటు విద్యాసంస్థల్లో రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. కార్యకమంలో ఆ సంఘం కేంద్రకమిటీ కోశాధికారి సోమశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ



రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

శింగనమల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకులేడు రైతు సేవా కేంద్రంలో రైతులకు బుధవారం యూరియా బస్తాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా నాయకులు రహితుల్లా, నాగభూషణ మాట్లాడుతూ ప్రభుత్వం సరాఫరా చేస్తున్న యూరియా ప్రతి రైతుకు అందుతుందని తెలిపారు. ఎక్కడా యూరియా కొరత లేదన్నారు. కొరత ఉన్నట్లు వైసీపీ వారు తప్పుడు ప్రచారం చేస్తూ రైతులను ఆందోళనలకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. నాయకులు మల్లికార్జున, ఓబుళయ్య, సుబ్రహ్మణ్యం, వడ్డె అంజనేయులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డుల పేరుతో హంగామా

- ఇంటింటికీ వెళ్లి అందించని సచివాలయ సిబ్బంది
- అందరినీ ఒకచోటకు రప్పించి అందజేస్తున్న వైనం
- ఓటీపీలు రాక లబ్ధిదారుల పడిగాపులు


దేవగిరిక్రాస్‌లో కార్డులు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డు దారుల ఇంటి వద్దకే వెళ్లి.. స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయాలని పాలకులు, అధికారులు స్పష్టమైన ఆదేశాలున్నాయి. అయినా సచివాలయ సిబ్బంది, రేషన్ షాప్ డీలర్లు, సివిల్ సప్లై అధికారులు ఆ ఆదేశాలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. మండలంలో అధికారులు, స్థానిక నాయకులు నానా హంగామా చేస్తూ.. గ్రామాల్లో ఒకే చోట లబ్ధిదారులను పిలిపించి గందరగోళం మధ్య స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్నారు. ఈ కార్డులు పంపిణీ సమయంలో లబ్ధిదారుల మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. నెట్‌వర్క్ పనిచేయకపోవడంతో.. గంటల తరబడి.. వేచి ఉండాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు. కాగా.. ఈ కార్డులు కొన్ని సచివాలయ సిబ్బంది వద్ద.. మరికొన్ని రేషన్ డీలర్ల వద్ద ఉన్నాయి. దీంతో తమ కార్డు ఎవరి వద్ద ఉందో తెలీక లబ్ధిదారులు తికమకపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి స్మార్ట్ రేషన్ కార్డులను ఇంటి వద్దనే అందించేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు. దీనిపై బొమ్మనహాళ్ ఇన్‌చార్జి సీఎస్‌డీటీను వివరణ కోసం సంప్రదించగా అందుబాటులో లేరు.

న్యూస్ బాక్స్

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేయండి


మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు నారాయణస్వామి

గుంతకల్లు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డు అభివృద్ధికి నూతన పాలకవర్గం, మార్కెట్ శాఖ అధికారులు కృషి చేయాలని టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి సూచించారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్ యార్డు పట్టణంలో ఉన్న కారణంగా ఎంతో విలువైన భూమి ఉందని, దాన్ని లీజుకు ఇవ్వడం, శీతల గిడ్డంగులను నిర్మించి రైతులకు ఉపయోగకరంగా మార్చి.. ఆదాయాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. యార్డుకు పలు రకాలుగా రావాల్సిన లీజు బకాయిలను రాబట్టాలని, తద్వారా రైతు సహాయక కార్యక్రమాలు చేయాలని అన్నారు. ఆసక్తి చూపే వ్యాపారుల ద్వారా డిపాజిట్లను సేకరించి షాపింగ్ కాంప్లెక్సుల నిర్మాణానికి కృషిచేయాలన్నారు. యార్డు అభివృద్ధికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనవంతు సహకారాన్ని అందిస్తారన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్ర కుమార్, యార్డు చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ రాణా ప్రతాప్, సభ్యులు శివానంద, శివమ్మ, అరుణ, శ్రీదేవి, సింగిల్ విండో సొసైటీ అధ్యక్షుడు తలారి మస్తానప్ప, మాజీ జడ్పీటీసీ సభ్యుడు మత్రునాయక్, యార్డు కార్యదర్శి రంగారావు, టీడీపీ నాయకులు బండారు ఆనంద్, గుణ శేఖర్, రాయల్ వెంకటేశులు పాల్గొన్నారు.

80సార్లు రక్తదానం చేసిన వెంకటేష్



గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 75వ పుట్టిన రోజు సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మంజుల వెంకటేష్ 80వ సారి రక్తదానం చేశాడు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంక్‌లో ఆయన రక్తదానం చేశాడు. రక్తదానం కేవలం ప్రాణాలను కాపాడటమే కాకుండా సమాజంలో ఐక్యతను పెంచుతుందని, ఆరోగ్యకరమైన దేశ నిర్మాణానికి దోహదపడుతుందని అన్నారు. తనతోపాటు రక్తదానం చేసిన కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం


బొమ్మనహాళ్‌లో కిట్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య పరిరక్షణకు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం దోహదం చేస్తుందని దర్గాహొన్నూరు వైద్యాధికారి రఫియా సూల్తాన్, బొమ్మనహాళ్ టీడీపీ నాయకులు పయ్యావుల అనీల్ అన్నారు. బుధవారం మండం కేంద్రంతో పాటు దర్గాహొన్నూరు గ్రామాల్లో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌ను వారు ప్రారంభించారు. మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా దేశాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించిందన్నారు. ఈ సందర్భంగా మహిళలకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శాంత బాయి, వైద్య సిబ్బంది బాలగంగధర పాల్గొన్నారు.

వలంటీర్లకు శిక్షణ

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో వలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ మాట్లాడుతూ.. పట్టణంలో చదువురాని వారు 6300 మంది ఉన్నారని, వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి 630 మంది వలంటీర్లను నియమించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భవాని, ఎంఈఓ మస్తాన్‌రావు, వయోజన విద్య సూపర్‌వైజర్ శీధర్, మెప్మా అధికారి మోహన్, కెరస్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు వేయించండి

ఉరవకొండ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లయన్స్ క్లబ్‌కు వెళ్లే మార్గంలో సీసీరోడ్డు వేయించాలని లయన్స్ క్లబ్ సభ్యులు లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, బాలచంద్ర కోరారు. అనంతపురంలోని రాంనగర్‌లో టీడీపీ నాయకులు పయ్యావుల శ్రీనివాసులుకు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు గణేష్‌బాబు, ప్రభాకర్ నాయుడు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక


ఎమ్మెల్యే గుమ్మనూరు ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు

గుత్తిరూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రజాపురం గ్రామానికి చెందిన వైసీపీ సర్పంచ్ విజయలక్ష్మి, నాయకులు కేశవులు, మల్లికార్జున, రంగస్వామి, నాగరాజు, అంజి.. మరో 30 కుటుంబాల వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం వీరంతా ఆలూరులోని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం స్వగృహంలో.. ఆయన ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఇందులో మార్కెట్ యార్డు చైర్మన్ ప్రతాప్, ఆసుపత్రి కమిటీ సభ్యులు చికెన్‌శీనా, సర్పంచు లింగమయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నివేదికలివ్వండి: ఎమ్మెల్యే


సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం అభివృద్ధికి ఆయాశాఖల అధికారులు నివేదికలు సిద్ధం చేయాలని, వాటిని ఆయా శాఖల మంత్రుల దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు. స్థానిక ప్రజావేదిక వద్ద నియోజకవర్గస్థాయి అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు అందాల్సిన రాయితీలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ కనెక్షన్లు, మెరుగైన వైద్యం, అవసరమైన భవనాలు.. ఇలా అన్ని శాఖల నుంచి పూర్తి స్థాయిలో నివేదికలు సిద్ధం చేయాలన్నారు.

- చెక్కుల పంపిణీ : నియోజకవర్గంలోని 26 మంది బాధితులకు రూ.29 లక్షల సీఎం సహాయ నిధి మంజూరైంది. ఆ చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే స్థానిక ప్రజావేదిక వద్ద అందజేశారు.
- సన్మానం :మినీ అంగన్‌వాడీలను ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసినందుకు సీడీపీఓలు, అంగన్‌వాడీటీచర్లు ఎమ్మెల్యే చేతుల మీదుగా కేక్‌కట్ చేయించారు.
- మోదీ జన్మదిన వేడుకలు :ప్రధానమంత్రి నరేంద్రమోడీ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని ఆధ్వర్యంలో స్థానిక ప్రజావేదిక వద్ద కూటమి నాయకులు కేక్ కట్ చేశారు.

పరిశ్రమల దివాలాపై అధికారుల విచారణ


యజమానులతో మాట్లాడుతున్న అధికారులు

తాడిపత్రి, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి పరిసర ప్రాంతాల్లో వందకొద్దీ ఉన్న నాపరాళ్లు, గ్రానైట్ పరిశ్రమలు దివాలా తీయడానికి కారణాలు ఏంటని జిల్లా ఇండస్ట్రియల్ అధికారులు రవీంద్రారెడ్డి, ఎక్స్‌పోర్ట్ అధికారి శివరాం, వైష్ణవి బుధవారం ఆరా తీశారు. పలువురు పరిశ్రమ యజమానులతో వారు చర్చించారు. ఎక్స్‌పోర్ట్, ట్రాన్స్‌పోర్టు తదితర అంశాలపై ఆరా తీశారు. పరిశ్రమలకు పూర్వవైభవం రావలంటే ఏం చర్యలు తీసుకోవాలనే దానిపై పరిశ్రమల యజమానులతో చర్చించారు.


పూజలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కాలవ

గోపులాపురంలో వైభవంగా ఊరుదేవర

కణేకల్లు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపులాపురంలో దేవమ్మ, పోలేరమ్మదేవి ఊరుదేవరను బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అమ్మవార్లను దర్శించుకొని.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట స్థానిక టీడీపీ నాయకులు ఆది, బసవరాజు, బాయినేని నవీన్, కిష్టప్ప, లాలెప్ప, ఆనంద్‌రాజ్, కళేకుర్తి సుదర్శన్, బీటీ రమేష్, వన్నారెడ్డి, కురుబ నాగరాజు, అనిల్ ఉన్నారు.

దివ్యాంగుల చట్టం పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ షర్మిల

పామిడి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల హక్కుల చట్టం-2016 తెలుగు అనువాదం పుస్తకాన్ని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ షర్మిల, పోలీసుస్టేషన్‌లో సీఐ యుగంధర్ బుధవారం ఆవిష్కరించారు. ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కోఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. హక్కుల పరిరక్షణలకు రాష్ట్రంలోని దివ్యాంగులు సంఘటితం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సాకే ఆంజనేయులు, మహిళ అధ్యక్షురాలు వడ్డే లక్ష్మీదేవి, మిమిక్రీ కళాకారుడు లింగమూర్తి, మైనార్టీ నాయకుడు రసూల్, మండల అధ్యక్షుడు కేశవాచారి, ఉపాధ్యాక్షుడు సర్వేష్, శివన్న, నరసింహులు, ప్రకాష్, నాగభూషణం పాల్గొన్నారు.

ప్రథమ చికిత్స కేంద్రం సీజ్


సీజ్ చేయిస్తున్న డీఎంహెచ్ఓ

గుంతకల్లు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా ఆర్ఎంపీలు నిర్వహిస్తున్న ప్రథమ చికిత్స కేంద్రాలపై డీఎంహెచ్ఓ ఈబీ దేవి బుధవారం దాడులు నిర్వహించారు. రూల్స్‌కు విరుద్ధంగా రోగులకు వైద్యం అందిస్తున్న స్థానిక పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో ఓ ప్రథమ చికిత్సా కేంద్రాన్ని సీజ్ చేశారు. అలాగే మరో కేంద్రానికి నోటీసు అందజేశారు. డీఎంహెచ్ఓ తనిఖీ చేస్తున్న విషయం తెలుసుకున్న ఆర్ఎంపీలు వారివారి వైద్య కేంద్రాలను మూసివేసి వెళ్లిపోయారు.

ఓటరు జాబితాపై సమీక్ష

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి రవిశంకర్‌రెడ్డి రాజకీయ నాయకులతో ఓటరు జాబితాపై బుధవారం సమీక్ష నిర్వహించారు. తప్పులులేని ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఇందులో తహసీల్దార్ నాగరాజు, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రిజర్వాయర్‌కు 2,372 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 2,372 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 2,332 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు బుధవారం తెలిపారు.

క్రైం న్యూస్..

మహిళ అదృశ్యం

కూడేరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లగళ్ళ గ్రామానికి చెందిన రామకృష్ణ భార్య ప్రియా అదృశ్యమైంది. ఈ నెల 15న ఇంటి నుంచి వెళ్లిపోయిన ఆమె తిరిగి రాలేదు. రామకృష్ణ పలుచోట్ల గాలించినా.. ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆయన బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

వైసీపీ మాజీ కౌన్సిలర్‌పై దాడి

తాడిపత్రి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ మద్దతుదారుడు రఘు, మరికొంత మంది తనపై బుధవారం రాత్రి దాడి చేసినట్లు వైసీపీ మాజీ కౌన్సిలర్ సూర్యప్రకాష్‌బాబు అలియాస్ బాబు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్థానిక అశోక్‌పిల్లర్ సమీపంలో టీస్టాల్ వద్ద తాను టీ తాగుతుండగా.. వీరు దాడి చేశారన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఘనంగా ఏకాదశి పూజలు


పామిడిలో దండి భజనతో ప్రాకారోత్సవం

పామిడి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రంగసుభేఫిర్కా భగవాన్ దాస్ విఠోబస్వామి దేవాలయం, అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి (తగ్గుదేవాలయం) ఆలయాలలో సర్వ ఏకాదశి పూజలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మూలవిరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. విఠోబస్వామి దేవాలయంలో దండి భజనలతో రుక్మిణి సమేత విఠోబస్వామి ఉత్సవ మూర్తులను ప్రాకారోత్సవం నిర్వహించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, పీఈటీ

వజ్రకరూరు(ఉరవకొండ), సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఆర్డీటీ క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి రగ్బీ పోటీల్లో వజ్రకరూరు మండలం గడేహోతూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటారు. అండర్-14 విభాగంలో అనిత, సూర్య అండర్- 19 విభాగంలో వైష్ణవి, మురారి, మల్లికార్జున రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. త్వరలో కర్నూలు, అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని హెచ్ఎం శ్రీనివాసులు రెడ్డి, పీఈటీ ప్రభాకర్ బుధవారం తెలిపారు.

జిల్లాస్థాయి పోటీలకు..


గోకుల్ కుమార్‌రెడ్డి, బాలాజీ

రాయదుర్గం రూరల్: జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు గోకుల్ కుమార్‌రెడ్డి, బాలాజి ఎంపికయ్యారు. ఈ నెల 15న నిర్వహించిన మండల స్థాయిలో ప్రతిభచాటిన వీరు జిల్లాస్థాయికి ఎంపికైనట్లు ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ఆసిఫ్ బుధవారం ప్రకటనలో తెలిపారు.

వారం రోజులుగా రిజిస్ట్రేషన్లు బంద్

బ్యాటరీ, యూపీఎస్‌ల సమస్యతో ఆగిన వైనం


క్రయవిక్రయదారులు లేక వెలవెలబోతున్న కార్యాలయం

యాడికి, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): యాడికి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వారంరోజులుగా రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. క్రయవిక్రయదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు కిటకిటలాడే యాడికి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం.. వారం రోజులుగా బోసిపోయింది. వారం క్రితం వర్షం పడిన సమయంలో విద్యుత్ ఓల్టేజీ హెచ్చుతగ్గులతో బ్యాటరీలు, యూపీఎస్‌లు చెడిపోయాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో విద్యుత్ నిరంతర సరఫరా అవసరం. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినప్పుడు.. యూపీఎస్‌లు పని చేయకపోవడం వల్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను అధికారులు పూర్తిగా నిలిపివేశారు. రెండు రోజులుగా యూపీఎస్ మరమ్మతులు చేపడుతున్నారు. దీనిపై యాడికి సబ్‌రిజిస్ట్రార్ జాఫర్ సాధిక్‌ను వివరణ కోరగా... 'విద్యుత్ హెచ్చుతగ్గులతో యూపీఎస్ పనిచేయడం లేదు. మరమ్మతులు చేయడానికి టెక్నీషియన్‌ను పిలిపించాం. ఎందుకు ఇలా జరిగిందో సమస్యను ఇంకా గుర్తించలేదు. వీలైనంత వేగంగా మరమ్మతులు చేపట్టి రిజిస్ట్రేషన్‌లను కొనసాగిస్తాం' అని తెలిపారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా సత్యబాబు

విడపనకల్లు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): విడపనకల్లు ఇన్‌చార్జి ఎంపీడీఓగా సత్యబాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ షకీలాబేగం ఉద్యోగోన్నతిపై కర్నూల్‌కు వెళ్లారు. దీంతో స్థానిక డిప్యూటీ ఎంపీడీఓ సత్యబాబుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

గడేకల్లులో పర్యటించిన డీఎల్‌డీఓ

విడపనకల్లు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడేకల్లు గ్రామంలో డీఎల్‌డీఓ విజయలక్ష్మి బుధవారం పర్యటించారు. హెల్త్ క్యాంప్‌ను పరిశీలించారు. వీధుల్లో పర్యటించి పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ప్రతి వీధి బ్లీచింగ్ చల్లాలని, దోమలు నివారణకు ఫాగింగ్ చేయించాలని సూచించారు. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి సోమయ్య ఉన్నారు.

కసాపురంలో మోదీ పేరిట పూజలు

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పుట్టిన రోజు సందర్భంగా కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో ఆయన పేరట బీజేపీ నాయకులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో పట్టణ అధ్యక్షుడు వడ్డె రమేష్, నాయకులు గుర్రం సూర్యనారాయణ, జీఎం మహేష్, విజయలక్ష్మి, గడ్డం సుజాత, సరిత, రామాంజినేయులు పాల్గొన్నారు.


ఉరవకొండ, బొమ్మనహాళ్‌లో విశ్వకర్మ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా విశ్వకర్మ జయంతి

ఉరవకొండ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో విశ్వకర్మ భగవాన్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం నుంచి ఈశ్వరమ్మ గుడి వరకు ఆయన చిత్రపటాన్ని ఊరేగించారు. అలాగే ఐటీఐ కళాశాలలో విశ్వకర్మ చిత్ర పటానికి పూజలు చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రహ్మణ సంఘం నాయకులు కృష్ణాచారి గోపి, జగదీష్, తిప్పయ్య, ధనుంజయ, బీజేపీ నాయకులు లాలెప్ప, ఐటీఐ ప్రిన్సిపాల్ రవీంద్ర పాల్గొన్నారు.

- బొమ్మనహాళ్: మండలకేంద్రంలో బుధవారం విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక రుక్మిణీ పాండురంగస్వామి ఆలయం వద్ద విశ్వకర్మ చిత్రపటానికి విశేష పూజలు చేశారు. సాయంత్రం ప్రత్యేక రథంలో విశ్వకర్మ చిత్రాపటాన్ని ఉంచి ఊరేగించారు. మహిళలు కలశాలు పట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నారు.
- గుంతకల్లు: స్థానిక దోనిముక్కల రోడ్డులో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి ఉత్సవాలను బుధవారం నిర్వహించారు. ఇందులో ఆ సంఘ అధ్యక్షుడు సంపత్‌కుమార్, కార్యదర్శి మధుసూధనాచారి, సభ్యులు హరి ప్రసాదాచారి, రమణాచారి, సర్వేశ్వరరావు ఆచారి, ఆదిశేషాచారి, రామాచారి, కృష్ణమాచారి పాల్గొన్నారు.


గుంతకల్లు: పూజలో పాల్గొన్న సంఘం నాయకులు

రేపటిలోగా వాహనమిత్రకు దరఖాస్తు చేసుకోండి

బెళుగుప్ప, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): అర్హులైన ఆటో డ్రైవర్లు వాహన మిత్ర పథకానికి శుక్రవారం లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ బుధవారం సూచించారు. గతంలో లబ్ధిపొందిన వారు ఈకేవైసీ చేయించి రెన్యువల్ చేసుకోవాలన్నారు. కొత్తవారు పూర్తి ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బుధవారం బెళుగుప్ప సచివాలయం వద్ద వెల్ఫేర్ అసిస్టెంట్ భార్గవి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కంచిరాముడు పాల్గొన్నారు.

బడికిరాని విద్యార్థుల గురించి ఆరా


తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పాఠశాలలోని ప్రతి విద్యార్థిపై మండలంలోని ఉద్దేహాళ్ హైస్కూల్ హెచ్ఎం, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించారు. బడికి సక్రమంగా రాకుండా డుమ్మా కొడుతున్న విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు వెళ్లి ఆరా తీస్తున్నారు. పిల్లలు కొద్ది రోజలుగా పాఠశాలకు రావడం లేదని, సక్రమంగా పాఠశాలకు రాకపోతే చదువులో వెనుకబడటమే కాకుండా... హాజరు శాతం తగ్గి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలూ దూరం అవుతాయని ఉపాధ్యాయులు వివరిస్తున్నారు. సక్రమంగా పిల్లాలను బడికి పంపించాలని తల్లిదండ్రులను కోరుతున్నారు.